## డీసీసీబీ సీఈవోగా సత్యనారాయణ

శ్రీకాకుళం కలెక్టరేట్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): జిల్లా కోపరేటివ్ సెంట్రల్ బ్యాంకు(డీసీసీబీ) సీఈవోగా దత్తి సత్యనారాయణ నియమితులయ్యారు. రాజమండ్రి రూరల్ బ్యాంకులో పనిచేస్తున్న ఆయనను జిల్లాకు బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో ఈయన 2014-21 మధ్య శ్రీకాకుళం డీసీసీబీలో సీఈవోగా పనిచేశారు. ఈ మేరకు ఆయన శుక్రవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆయన కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌ను కలుసుకున్నారు. ఇక్కడ సీఈవోగా పనిచేస్తున్న వరప్రసాదరావు వ్యక్తిగత కారణాలతో రిజైన్ చేశారు.

# వైద్య కళాశాలలో.. వసతుల్లేవ్!


శ్రీకాకుళంలోని ప్రభుత్వ వైద్య కళాశాల

అరసవల్లి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి)

శ్రీకాకుళంలోని ప్రభుత్వ వైద్య కళాశాల (రిమ్స్)లో విద్యార్థులు వసతుల లేమితో ఇబ్బందులు పడుతున్నారు. కనీసం తాగునీరు, నాణ్యమైన ఆహారం, మరుగుదొడ్ల సౌకర్యం లేక.. దుర్భర పరిస్థితుల్లో చదువులు కొనసాగిస్తున్నారు. ఈ కళాశాలలో 650 మంది విద్యార్థులు ఎంబీబీఎస్ చదువుతున్నారు. అలాగే 150 మంది హౌస్‌సర్జన్లు, 200 మంది పీజీ విద్యార్థులు వైద్య విద్యను అభ్యసిస్తున్నారు. వీరంతా వైద్య కళాశాలలో కనీస వసతులు లేక మనోవేదనకు గురవుతున్నారు. సమస్యలు పరిష్కరించాలని ఎన్నిసార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేకపోతోందని వాపోతున్నారు.

- కనీసం తాగునీరు లేక అవస్థలు
- 64 మరుగుదొడ్లకు మూడే వినియోగం
- విద్యార్థుల పరిస్థితి దయనీయం
- పట్టించుకోని అధికారులు
- డీఎంఈ ఆదేశాలు సైతం బేఖాతరు


వైద్యవిద్యార్థుల రీడింగ్ రూమ్ ఇలా..

### సమస్యలెన్నో..

● వైద్యవిద్యార్థులకు దాహం వేస్తే తాగేందుకు మంచినీటి సౌకర్యం లేదు. వాటర్‌ప్లాంట్‌లు పాడై చాలా కాలమైనా పట్టించుకునే నాథులు లేరు. వరండాలో ఏర్పాటు చేసిన క్యాన్‌లలో నీరే దిక్కవుతోంది. కళాశాలతోపాటు హాస్టల్‌లోనూ తాగునీటి వసతిలేకపోవడంతో విద్యార్థులు వాటర్ బాటిళ్లతోనే నెట్టుకొస్తున్నారు.

● కళాశాలలోని మూడు అంతస్తుల్లో ఎక్కడా తాగునీరు కనిపించదు సరికదా.. కనీస అవసరాలు తీర్చుకునేందుకు మరుగుదొడ్లు కూడా పనిచేయడం లేదు. కనీసస్థాయిలో మరమ్మతులు చేయకుండా వదిలేయడంతో విద్యార్థులు బయటకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. వైద్య విద్యార్థినులు అయితే.. హాస్టల్‌కు పరిగెత్తాల్సిందే. పరీక్షల సమయంలో మరింత ఇబ్బందులు పడాల్సిందే. మెన్స్ హాస్టల్‌లో 64 మరుగుదొడ్లకుగానూ కేవలం మూడు మాత్రమే వినియోగంలో ఉన్నాయి. ఉమెన్స్ హాస్టల్‌లో 8 మాత్రమే వినియోగానికి అనువుగా ఉన్నాయి. వాటిల్లో కూడా కొన్నింటికి తలుపులు, లైట్లు కూడా లేవు.


పనిచేయని వాటర్ ప్లాంటు

● వైద్య కళాశాల హాస్టల్ కొత్త భవనాలకు రంగులేశారు. కానీ విద్యార్థులకు హాస్టల్ గదుల్లో సరైన బెడ్స్, కుర్చీలు, కనీస వసతులు కూడా కల్పించలేదు. ఏటా సీట్ల సంఖ్యను పెంచుకోవడంపై ఉన్న శ్రద్ధ.. వసతుల కల్పనపై లేదని విద్యార్థులు గుసగుసలాడుకుంటున్నారు.

### ● లైట్లు, కుర్చీలు లేకుండానే గ్రంథాలయం..

విద్యార్థులు చదువుకునేందుకు కళాశాల మొదటి అంతస్తులో సెంట్రల్ లైబ్రరీ ఉంది. దీనిలోనే రీడింగ్ రూమ్ కూడా ఉంటుంది. కానీ గ్రంథాలయంలో కూర్చునేందుకు కుర్చీలు, చదువుకునేందుకు సరిపడా బల్లలు లేవు. ఫ్యాన్లు తిరగవు. లైట్లు కూడా సక్రమంగా వెలగవు. గ్రంథాలయం పరిసరాల్లో (మిగతా 6వ పేజీలో..)

### చర్యలు తీసుకుంటున్నాం..

వైద్య విద్యార్థుల హాస్టల్, కళాశాలలో వసతులకు సంబంధించి అన్ని చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే ఇంజనీరింగ్ అధికారులకు చెప్పాం. కొత్త హాస్టల్‌కు సంబంధించి రానున్న రెండు నెలల్లో ఫర్నీచర్‌ను సమకూర్చి విద్యార్థులకు అందజేస్తాం. హాస్టల్‌లో విద్యార్థులు మెస్ రన్ చేసుకుంటున్నారు. విద్యార్థులు కోరితే ఫుడ్ కాంట్రాక్టర్‌ను మార్చడానికి మేం సిద్ధంగా ఉన్నాం.

-డా.రవి వెంకటాచలం, ప్రిన్సిపాల్, జీజీహెచ్ (రిమ్స్) కళాశాల


జస్టిస్ శేషసాయి దంపతులకు జ్ఞాపికను అందజేస్తున్న ఆలయ సూపరింటెండెంట్

## ఆదిత్యుడి సన్నిధిలో హైకోర్టు జడ్జి

అరసవల్లి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ప్రత్యక్షదైవం.. ఆరోగ్యప్రదాత.. అరసవల్లిలో ఆదిత్యుడ్ని హైకోర్టు జడ్జి జస్టిస్ శేషసాయి దంపతులు శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు వారికి స్వాగతం పలుకగా, అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించారు. స్వామి జ్ఞాపికను, ప్రసాదాన్ని ఆలయ సూపరింటెండెంట్ ఎస్.కనకరాజు వారికి అందజేశారు.

# దొరికితేనే దొంగలు!



- జిల్లా నుంచి యథేచ్ఛగా ఇసుక రవాణా
- రోజుకు సగటున 150 లారీల్లో తరలింపు
- పైడిభీమవరం చెక్‌పోస్టు వద్ద జేసీ తనిఖీలు
- నకిలీ పత్రాలతో పట్టుబడిన 12 లారీలు

పైడిభీమవరం వద్ద జేసీకి పట్టుబడిన ఇసుక లారీలు


పైడిభీమవరం చెక్‌పోస్ట్ వద్ద రికార్డులు పరిశీలిస్తున్న జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

రణస్థలం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇసుక అక్రమ రవాణా వ్యవహారం 'దొరికితేనే దొంగలు' అన్న చందంగా తయారైంది. జిల్లా అధికారులు తనిఖీలు చేసినప్పుడు అక్రమార్కులు పెద్దసంఖ్యలు పట్టుబడుతున్నారు. మిగతా రోజుల్లో అంతా 'మామూలే'. విశాఖపట్నం జాతీయ రహదారి మీదుగా రోజూ వందలాది లారీల్లో ఇసుక తరలిపోతున్నా స్థానిక అధికారులు కళ్లప్పగించి చూస్తుండిపోతున్నారు. శుక్రవారం రణస్థలం మండలం పైడిభీమవరంలోని చెక్‌పోస్టు వద్ద జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ శుక్రవారం సాయంత్రం ఆకస్మిక తనిఖీలు చేయగా.. ఇసుక అక్రమాలు మరోసారి బయటపడ్డాయి. మొత్తం 28 ఇసుక లారీలను తనిఖీ చేయగా అందులో 16 లారీలకు సంబంధించి అన్నిరకాల ధ్రువీకరణ పత్రాలు ఉన్నాయి. మిగిలిన 12 లారీలకు సంబంధించి నకిలీ ధ్రువీకరణ పత్రాలుగా గుర్తించారు. రెవెన్యూ అధికారులు ఆ లారీలను జేఆర్‌పురం పోలీసులకు అప్పగించారు. పెద్ద ఎత్తున ఇసుక లారీలు పట్టుబడడంతో అక్రమాల వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. అయితే జేసీ తనిఖీ చేసే సమయానికి దిగువస్థాయి సిబ్బంది లేరు. లేదంటే అంతకు మించి లారీలు పట్టుబడే అవకాశముండేదని అధికారిక వర్గాలు చెబుతున్నాయి.

### ● ఆ రెండు నదుల నుంచి..

జిల్లాలోని వంశధార, నాగావళి నదులు ఇసుక అక్రమార్కులకు వరంగా మారాయి. కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని ప్రవేశపెట్టింది. అయితే దీనినే ఆసరాగా చేసుకొని ఇసుక అక్రమార్కులు బరి తెగిస్తున్నారు. ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకొస్తున్నారు. జిల్లాలో అధికారికంగా 18 రేవులకు అనుమతులిచ్చారు. వంశధారకు సంబంధించి కొత్తూరు మండలం నుంచి గార మండలం వరకూ... నాగావళి నదికి సంబంధించి బూర్జ మండలం నుంచి శ్రీకాకుళం రూరల్, ఎచ్చెర్ల మండలం నుంచి రేవులకు అనుమతిచ్చారు. అయితే అక్రమార్జనకు అలవాటుపడిన ఇసుకాసురులు అనుమతులకు మించి నదులు, రీచుల్లో ఇసుక తవ్వకాలు చేపడతున్నారు. అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు.

### ● రకరకాల అనుమతులు

ఇసుక తవ్వకాలకు సంబంధించి రీచ్‌లకు రకరకాల అనుమతులు ఉన్నాయి. డిస్టిలేషన్ కింద అంగూరు, గార, ఖండ్యాం... సెమీ మైకనైజ్డ్ కింద అంధవరం, బైరి, దొంపాక రీచ్‌లు ఉన్నాయి. మాన్యువల్ పద్ధతిలో హయాతీనగరం, కిల్లిపాలెం, ముద్దాడపేట (ఆమదాలవలస), ముద్దాడపేట(ఎచ్చెర్ల), నివగాం, పర్లాం, పురుషోత్తపురం-12, అంబళ్లవలస, బట్టేరు, బూరవల్లి, గోపలపెంటలో రేవులు ఉన్నాయి. వీటిలో ప్రస్తుతం అంగూరు, కిల్లిపాలెం, ముద్దాడపేట (ఎచ్చెర్ల) (మిగతా 6వ పేజీలో..)


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా న్యాయాధికారి జేపీ మౌలానా

## పెండింగ్ కేసులు తగ్గించాలి

- జిల్లా న్యాయాధికారి జునైద్ అహ్మద్ మౌలానా
- 8న జాతీయ లోక్‌అదాలత్

7లో

## బాల్యంపై క్యాన్సర్ పంజా

- పిల్లల్లో పెరుగుతున్న బాధితులు
- తొలిదశలో గుర్తిస్తే నివారణకు అవకాశం
- ప్రభుత్వాస్పత్రుల్లో అందుబాటులో వైద్యం
- నేడు ఇంటర్నేషనల్ చైల్డ్‌హుడ్ క్యాన్సర్ డే

6 లో

## 'స్వచ్ఛత'లో సిక్కోలుకు 6వ స్థానం

- జాబితా విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం

## ఆదివాసీలపై దాడులు ఆపండి

- వామపక్షాలు, ప్రజా సంఘాల డిమాండ్

6 లో

# తప్పు చేసిన వారిపైనే చర్యలు


పనులు చేస్తున్న ఉపాధిహామీ కూలీలు

- ఉపాధిహామీ పథకంలో మార్పులకు శ్రీకారం

మెళియాపుట్టి, ఫిబ్రవరి 14: ఉపాధిహామీ పథకంలో పలు మార్పులకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. పనుల్లో అవకతవకలు.. నిధులు దుర్వినియోగానికి సంబంధించి అందరిపైనా కాకుండా.. తప్పు చేసిన వారిపైనే చర్యలు తీసుకోనుంది. ఇందులో భాగంగా ఎన్‌ఆర్‌డీఎస్ మార్గదర్శకాల్లో సొసైటీ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ సర్వీస్ నిబంధనల మార్పునకు శ్రీకారం చుట్టింది. కాంటాక్టు, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించనుంది. ప్రస్తుతం అమలవుతున్న నిబంధనలతో తప్పు చేసినవారితోపాటు చేయనివారు కూడా శిక్ష అనుభవించాల్సి వస్తోంది. ఉదాహరణకు ఇటీవల మెళియాపుట్టి మండలంలో ఉపాధిహామీ పనులకు సంబంధించి అవకతవకలు జరిగినట్టు సామాజిక తనిఖీలో గుర్తించారు. కిందిస్థాయిలో జరిగిన తప్పులకు కార్యాలయంలో పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్ నుంచి సైతం రికవరీకి ఆడిట్ అధికారులు చర్యలు చేపట్టారు. దీంతో కంప్యూటర్ ఆపరేటర్ లబోదిబోమన్నారు. ఇటువంటి ఘటనలపై ప్రభుత్వానికి పలు ఫిర్యాదులు అందాయి. ఈ నేపథ్యంలో తప్పుచేసిన వారిపైనే చర్యలు తీసుకునేలా 'ఉపాధిహామీ'లో నిబంధనలు మార్పు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్ కృష్ణతేజ.. ఉపాధిహామీ సిబ్బంది నుంచి అభిప్రాయాలను సేకరించినట్టు తెలుస్తోంది.

### జిల్లాలో ఇదీ పరిస్థితి

జిల్లాలో ఇప్పటివరకూ 1,609 మంది ఉపాధిహామీ సిబ్బంది సుమారు రూ.67.04 లక్షల నిధులు పక్కదోవ పట్టించినట్లు అధికారులు లెక్క తేల్చారు. ఇందులో రూ.13.45 లక్షలు మాత్రమే రికవరీ చేశారు. కొంతమంది ఫీల్డ్ అసిస్టెంట్లు.. మేట్లకు పనులు అప్పగిస్తున్నారు. వారికి సరైన అవగాహన లేక తప్పులు జరుగుతున్నాయి. పత్రాలు సరిగా లేక సామాజిక తనిఖీలు ఇవి వెలుగుచూస్తున్నాయి. దీంతో అందరిపైనా ఆడిట్ అధికారులు రికవరీ రాస్తుండడంతో సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. తాజాగా కూటమి ప్రభుత్వ నిర్ణయంతో తప్పు చేయనివారిపై చర్యలు ఉండవని హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### ఇప్పటివరకూ ఏపీవోలను వదిలేశారు..

'ఉపాధిహామీ'లో ఇప్పటివరకూ నిధులు పక్కదారి పట్టినట్టు ఆడిట్ సిబ్బంది గుర్తిస్తే.. ఏపీవోను వదిలేసి.. కిందిస్థాయి సిబ్బంది నుంచే రికవరీ చేసేవారు. ఎన్‌ఆర్‌డీఎస్ నిబంధన ప్రకారం ఏపీవోలు రికవరీ నుంచి తప్పించుకునేవారు. మండల స్థాయిలో పనులు జరుగుతున్నాయో లేదో ఏపీవోలు పర్యవేక్షించాలి. సిబ్బంది అవినీతికి పాల్పడితే సరిచేయాల్సిన బాధ్యత వారిపై ఉంది. కానీ, క్షేత్రస్థాయిలో ఇది అమలుకాకపోవడంతో.. కిందిస్థాయిలో తప్పులు జరుగుతున్న ట్టు తెలుస్తోంది. ఫీల్డ్ అసిస్టెంట్ రూ.10వేలకు పైగా అవినీతికి పాల్పడినట్టు సామాజిక తనిఖీలో గుర్తిస్తే వెంటనే సస్పెండ్ చేస్తారు. టెక్నికల్ అసిస్టెంట్‌లు, కంప్యూటర్ ఆపరేటర్లకు రూ.25వేల కంటే ఎక్కువగానూ, ఈసీకి అయితే రూ.50వేలకుపైగా అవినీతి జరిగితే చర్యలు తీసుకుంటారు. కొలతల విషయంలో టెక్నికల్ అసిస్టెంట్లు, ఈసీని మాత్రమే బాధ్యులను చేస్తున్నారు. ఇలా తప్పుచేసిన వారు.. చేయనివారు సైతం బాధ్యులవుతున్నారు.


శరీరంపై పెట్రోల్ పోసుకుంటున్న సన్యాసమ్మ

## ఉద్యోగాల పేరుతో మోసం

- రూ.18.60 లక్షలకు టోకరా
- నిద్రమాత్రలు మింగి.. శరీరంపై పెట్రోల్ పోసుకున్న బాధితురాలు
- టెక్కలి గొల్లవీధిలో కుటుంబ సభ్యుల నిరసన

8 లో

## భారీగా గంజాయి పట్టివేత

- ఇచ్ఛాపురంలో 18.3 కిలోలు..
- కంచిలిలో 2.08 కిలోలు
- ఐదుగురి అరెస్టు

7 లో


కంచిలి: మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటప్పారావు



# బాల్యంపై క్యాన్సర్ పంజా



- పిల్లల్లో పెరుగుతున్న బాధితులు
- తొలిదశలో గుర్తిస్తే నివారణకు అవకాశం
- ప్రభుత్వాస్పత్రుల్లో అందుబాటులో వైద్యం

## నేడు ఇంటర్నేషనల్ చైల్డ్‌హుడ్ క్యాన్సర్ డే

అరసవల్లి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి)

క్యాన్సర్.. ఈ పేరు వింటేనే హడలిపోతాం. మన చుట్టూ ఉన్న వారిలో ఎవరికైనా క్యాన్సర్ సోకిందని తెలిస్తేనే బాధపడిపోతాం. ఇక చిన్నపిల్లలకైతే ఆ ఆవేదన చెప్పనలవి కాదు. ఇటీవల కాలంలో చిన్న పిల్లల్లోనూ క్యాన్సర్ లక్షణాలు కనిపించడం ఆందోళన కలిగిస్తోంది. బాలల నవ్వులను మొగ్గలోనే తుంచేస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా ఏటా క్యాన్సర్ భారిన పడుతున్న పిల్లల సంఖ్య పెరుగుతూ వస్తున్నాయని గణాంకాలు చెబుతున్నాయయి. మన దేశంలో ఏడాది సుమారు 75,000 మంది బాలలు కొత్తగా క్యాన్సర్ బారిన పడుతున్నట్టు సమాచారం. శ్రీకాకుళం జిల్లాకు సంబంధించి ఎంతమంది ఈ వ్యాధి బారిన పడుతున్నారనేది అధికారికంగా వైద్యులు చెప్పలేకపోతున్నారు. ఎక్కువ మంది ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తుండడమే దీనికి కారణంగా చెబుతున్నారు. ఏటా ఫిబ్రవరి 15న అంతర్జాతీయ బాల్య కేన్సర్ దినాన్ని నిర్వహిస్తున్నారు. 2002 నుంచి ప్రపంచ వ్యాప్తంగా దీనిపై దృష్టి సారించి ప్రజల్లో విస్తృత అవగాహన, ప్రచారం కల్పిస్తున్నారు.

### ● పిల్లల్లో క్యాన్సర్ రకాలు..

దేశంలో 0 - 14 ఏళ్ల వయసు గల పిల్లలలో వచ్చే క్యాన్సర్ ప్రధానంగా మూడు రకాలుగా ఉంటుంది. అధికశాతం పిల్లల్లో లుకేమియా (బ్లడ్ కేన్సర్), బ్రెయిన్ ట్యూమర్స్, లింఫోమాస్ కనిపిస్తాయి.

### ● ఇవీ లక్షణాలు..

తీవ్ర జ్వరం రావడం, రెండు వారాలైనా తగ్గకపోవడం, అకారణంగా బరువు తగ్గడం, తీవ్ర అలసట, తరచుగా ఇన్‌ఫెక్షన్‌లకు గురవ్వడం, కంట్లో తెల్లమచ్చలు, నడకలో మార్పు రావడం, మాటలు తడబడడం, తరచుగా తలనొప్పి, వాంతులు, రక్తహీనత, పొట్ట, దవడలు, చేతులు, కాళ్లు, గజ్జల్లో వాపు రావడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఈ లక్షణాలు కనిపించిన వెంటనే ఆలస్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలి.

### ● కారణాలు..

అధిక బరువు కలిగి ఉండడం, అనారోగ్యకర ఆహారపు అలవాట్లు, తరచుగా రోగాల బారిన పడుతుండడం క్యాన్సర్‌కు కారణమవుతున్నాయి. శారీరక శ్రమ లేకపోవడం, రోగ నిరోధక వ్యవస్థ బలహీనంగా ఉండడం, తల్లి గర్భం దాల్చిన సమయంలో ఆల్కహాల్, స్మోకింగ్, మందులు అధికంగా వాడడం, జన్యుపరమైన కారణాలు పిల్లల్లో క్యాన్సర్‌కు దారితీస్తాయి.

### ● ఈ పరీక్షలతో...

లుకేమియాకు సంబంధించి పిల్లలకు మొదట సీబీసీ అనే రక్తపరీక్ష చేస్తారు. ఇందులో తెల్లరక్తకణాల పెరుగుదల, ప్లేట్‌లెట్స్ తగ్గడం, రక్తహీనతను గమనిస్తే వారికి బోన్‌మారో పరీక్ష నిర్వహిస్తారు. వీటి ద్వారా పిల్లల్లో బ్లడ్ కేన్సర్ (లుకేమియా) ఉందో లేదోనని నిర్ధారణ చేస్తారు. బ్రెయిన్ ట్యూమర్‌కు సంబంధించి సీటీ స్కాన్ లేదా ఎంఆర్‌ఐ స్కాన్ పరీక్ష ద్వారా, లింఫోమాస్‌ను బయాప్సీ పెట్‌స్కాన్ ద్వారా నిర్ధారిస్తారు.

### ● చికిత్సా విధానాలు..

ప్రస్తుతం పిల్లలకు వచ్చే క్యాన్సర్‌లో లుకేమియాకు సంబంధించి కీమోథెరపీ చికిత్స, లింఫోమా, బ్రెయిన్ ట్యూమర్‌లకు సంబంధించి శస్త్రచికిత్స, రేడియేషన్, కీమోథెరపీ చికిత్సలను అందిస్తారు. పిల్లల్లో వచ్చే క్యాన్సర్‌ను చాలావరకు నివారించవచ్చు. తొలి దశలో గుర్తించడం... పూర్తి స్థాయి చికిత్సను అందించడం ద్వారా పూర్తిగా నివారించవచ్చని వైద్యులు చెబుతున్నారు. బాల్యంలో తగ్గినప్పటికీ మరో 10 లేదా 20 ఏళ్ల తరువాత క్యాన్సర్ లక్షణాలు కనిపించే అవకాశం ఉందని వైద్య నిపుణులు చెబుతున్నారు.

### ● నివారణ మార్గాలు..

ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం, పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు ఆహారంలో తప్పనిసరిగా ఉండేలా చూసుకోవాలి. అధిక బరువు లేకుండా వ్యాయామం చేయడం, దుమ్ము, ధూళి నుంచి రక్షణ, వ్యాక్సిన్లు రెగ్యులర్‌గా వేసుకోవడం వంటి మార్గాల ద్వారా కొంతవరకు పిల్లలకు క్యాన్సర్ సోకకుండా నిరోధించవచ్చు.

### ● అవగాహన, రక్షణ లక్ష్యంగా...

పిల్లల్లో వచ్చే క్యాన్సర్‌పై ప్రజలకు అవగాహన కల్పించడం... అవసరమైన సాయం... చికిత్సను అందజేయడం ద్వారా పిల్లల జీవితాలను రక్షించడమే లక్ష్యంగా ప్రభుత్వం కార్యక్రమాలను నిర్వహిస్తోంది. పరిశోధన, నూతన చికిత్సా విధానాలు, చికిత్సల కోసం నిధుల సేకరణ వంటి కార్యక్రమాలను చేపడుతున్నారు. వలంటీరుగా సేవలందించడం, తల్లిదండ్రులకు భరోసాగా నిలబడడం, బాల్య క్యాన్సర్‌పై పరిశోధనకు న్యాయవాదిని నియమించడం, క్యాన్సర్‌ను జయించిన వారి వివరాలను పెద్దఎత్తున ప్రచారం చేయడం వంటి వాటిపై దృష్టి పెట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

### ● అందుబాటులో చికిత్స..



నేడు పిల్లలకు సంబంధించిన క్యాన్సర్‌కు చికిత్సలు అందుబాటులో ఉన్నాయి. శ్రీకాకుళంలో గల రిమ్స్ ఆసుపత్రిలో ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తున్నాం. సీటీ స్కాన్, ఎంఆర్‌ఐ స్కాన్ అందుబాటులో ఉన్నాయి. అవసరమైన అన్ని రక్తపరీక్షలు, బయాప్సీ పరీక్షలు కూడా చేస్తున్నాం. ఒకవేళ క్యాన్సర్‌గా నిర్ధారణ అయితే కీమోథెరపీ చికిత్సకు సంబంధించిన మందులను కూడా ఉచితంగా అందిస్తున్నాం. పిల్లల్లో దీనికి సంబంధించిన లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యుని సంప్రదించాలి. తొలి దశలోనే గుర్తిస్తే పూర్తిగా నివారణ సాధ్యం.

-డాక్టర్ నందాన రవీంద్ర, క్యాన్సర్ స్పెషలిస్టు, రిమ్స్, శ్రీకాకుళం

---

## మండపల్లి సర్పంచ్ చెక్ పవర్ రద్దు

● నిధుల దుర్వినియోగానికి పాల్పడినట్టు ఫిర్యాదులు

ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ నిధుల దుర్వినియోగానికి పాల్పడినట్టు తేలడంతో మండపల్లి సర్పంచ్ పిట్ట శశిరేఖ చెక్ పవర్‌ను రద్దు చేసినట్లు డీపీఓ భారతి ఉత్తర్వులు జారీ చేశారని ఎంపీడీఓ రామారావు తెలిపారు. 2021 నుంచి ఇప్పటి వరకు చేపట్టిన వివిధ అభివృద్ధి పనులు, పారిశుధ్య కార్యక్రమాలకు సంబంధించి సర్పంచ్ సుమారుగా రూ.85 లక్షల వరకు పంచాయతీ నిధులు దుర్వినియోగం చేసినట్లు పలుమార్లు స్థానికులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. డీపీఓ ఆదేశాల మేరకు స్పందించిన అధికారులు శుక్రవారం డీఎల్‌పీవో గోపిబాల, ఈవోఆర్డీ ఎస్.కృష్ణ మండపల్లి పంచాయతీ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. ఎటువంటి తీర్మానాలు లేకుండా నిధులు ఎలా ఖర్చు చేశారని సంబంధిత సర్పంచ్‌ను ప్రశ్నించారు. దీంతో ఆమె సమాధానం చెప్పలేక దాటవేసే ప్రయత్నం చేశారు. రూ.85 లక్షలు పక్కదారి పట్టడంతో డీపీఓ ఆదేశాల మేరకు సర్పంచ్ చెక్ పవర్ రద్దు చేసినట్టు ఎంపీడీఓ తెలిపారు.

## 3న చిన్నజీయర్ స్వామి రాక

టెక్కలి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): మేజర్ పంచాయతీ టెక్కలిలో మార్చి 3న జరిగే శ్రీరామ పాదుకా పట్టాభిషేక కార్యక్రమానికి త్రిదండి చిన్నజీయర్ స్వామి హాజరవుతున్నారని వికాస తరంగిణి ప్రతినిధి మూల వేమన తెలిపారు. ఈ కార్యక్రమం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహించనున్నామని, భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని ఆయన కోరారు.



## చేపల కోసం కొంగల్లా..!

సంతబొమ్మాళి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బోరుభద్ర బంజీరు చెరువులో నీరు ఇంకిపోతోంది. చివరి దశకు చేరుకుంది. దీంతో చేపలు బయట పడుతున్నాయి. శుక్రవారం సాయంత్రం ఈ చేపలను పట్టుకునేందుకు స్థానికులు పెద్ద సంఖ్యలో చెరువు వద్దకు చేరుకున్నారు. వలలు, ఊజులతో అందిన కాడికి చేపలను పట్టుకున్నారు.

---

## వైద్య కళాశాలలో.. వసతుల్లేవ్!

(ఐదో పేజీ తరువాయి)

కూడా లైట్లు లేకపోవడంతో విద్యార్థినులు రాత్రివేళల్లో హాస్టల్‌కు వెళ్లేందుకు భయపడుతున్నారు. హాస్టల్‌లోని మూడు బాత్‌రూమ్‌ల్లో కూడా లైట్లు వెలగడం లేదని పేర్కొంటున్నారు. హాస్టల్ గదుల్లోకి తరచూ పాములు, ఎలుకలు వస్తుండడంతో ఆందోళన చెందుతున్నారు. విద్యార్థుల నుంచి అభివృద్ధి నిధులు పేరిట వసూలు చేసిన డబ్బులు రూ.లక్షల్లో ఉన్నా.. వాటిని వినియోగించడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.



ఎంబీబీఎస్ విద్యార్థుల హాస్టల్ గది ఇలా..

### ● పీజీ విద్యార్థులకు హాస్టలేదీ?

వైద్య కళాశాలలో పీజీ విద్యార్థులకు హాస్టల్ సదుపాయం లేదు. ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి (జీజీహెచ్)లో 30రూమ్‌లను వారికి తాత్కాలికంగా అద్దె ప్రాతిపదికన కేటాయించారు. వీటిలో నాలుగు రూమ్‌లను ఆస్పత్రి అధికారులు.. తమ బంధువుల కోసం వినియోగిస్తున్నారు. దీంతో చాలామంది పీజీ విద్యార్థులు బయట రూమ్‌లు అద్దెకు తీసుకుని ఉంటున్నారు. కొత్త భవనాలు అందుబాటులోకి వస్తున్నాయని, సమస్యలన్నీ పరిష్కారమైపోతాయని, గత మూడేళ్లుగా అధికారులు చెబుతూనే ఉన్నారు. ఈ ఏడాది 19 విభాగాలకు సంబంధించి సుమారు మరో 100 మంది విద్యార్థులు పీజీ కోర్సుల్లో చేరనున్నారు. మరి వారి పరిస్థితి ఏంటో అధికారులకే తెలియాలి.

### హాస్టల్ వార్డెన్ బంధువే.. ఫుడ్ కాంట్రాక్టర్

హాస్టల్ మెస్‌లో వైద్య విద్యార్థులకు అందించే ఆహారం సరిగా ఉండడం లేదు. హాస్టల్ వార్డెన్ బంధువే.. ఫుడ్ కాంట్రాక్టర్. దీంతో ఆహారం నాణ్యతపై ఎవరైనా విద్యార్థులు ప్రశ్నిస్తే.. విద్యార్థులను పరీక్షల్లో ఫెయిల్ చేస్తామని బెదిరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అలాగే హాస్టల్ మెస్ కార్డు తప్పనిసరిగా తీసుకోవాలని.. బలవంతంగా మెస్ బిల్లులు కట్టిస్తున్నారని పలువురు విద్యార్థులు ఆరోపిస్తున్నారు. బయట తినేందుకు కూడా తమకు స్వేచ్ఛ లేదని, ఇటువంటి దుర్భర పరిస్థితుల్లో చదువు కొన సాగేదెలా? అని వారు వాపోతున్నారు.

### ● డీఎంఈ ఆదేశాలిచ్చినా..

వైద్య కళాశాల, హాస్టల్‌లో విద్యార్థులకు వసతుల కల్పనపై డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ నుంచి ఇటీవల ఆదేశాలు వచ్చినా సరే సంబంధిత అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. రాత్రివేళల్లో వైద్యవిద్యార్థినుల కోసం సెక్యూరిటీని ఏర్పాటు చేయాలని కోరినా ఎవరూ పట్టించుకునే పరిస్థితి లేదు. ఏదైనా జరగరాని సంఘటన జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని విద్యార్థులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కనీస సదుపాయాలు కల్పించాలని వారు కోరుతున్నారు.

---

## ఆదివాసీలపై దాడులు ఆపండి

● వామపక్షాలు, ప్రజా సంఘాల డిమాండ్

కాశీబుగ్గ, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్- బీజాపూర్ మధ్య భారతంలో ఆపరేషన్ కగార్ పేరుతో ఆదివాసీలపై సైనిక బలగాల దాడులను తక్షణమే ఆపాలని వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాలు, హక్కుల సంఘాల సభ్యులు డిమాండ్ చేశారు. శుక్రవారం కాశీబుగ్గ పాత బస్టాండ్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ దేశ మూలవాసులపై యుద్ధం సిగ్గు చేటని అన్నారు. ఆపరేషన్ కగార్‌ను తక్షణమే నిలిపివేయాలని వక్తలు డిమాండ్ చేశారు. పర్యావరణాన్ని, ప్రకృతిని, సహజ వనరులను కాపాడుతున్న ఆదివాసీలపై అంతర్యుద్ధం ప్రకటించినప్రధాని మోదీ, అమిత్‌షాల చర్యలను ఖండించాలని వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాలు పిలుపునిచ్చాయి. మావోయిస్టుల పేరుతో ఆదివాసీలను అంతమొందించి... అడవు లను బహుళ జాతి కంపెనీలకు అప్పగించడానికి ఆపరేషన్ కగార్‌ను చేపట్టారని ఆరోపించారు. మావోయిస్టు భావజాలం కలిగి ఉండడం నేరం కాదని కోర్టులే స్వయంగా చెబుతున్నాయని గుర్తు చేశారు. డ్రోన్ కెమెరాలతో అడవుల్లో జల్లెడ పట్టి సాధారణ ఆదివాసీలను కాల్చి చంపుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో వామపక్ష, ప్రజా సంఘాల నాయకులు తాండ్ర ప్రకాష్, మాధవరావు, చాపర వేణుగోపాల్, మోహన్‌రావు, సన్యాసిరావు, రామారావు, దానేష్, కోదండరావు తదితరులు పాల్గొన్నారు.




నిరసన కార్యక్రమంలో పాల్గొన్న ప్రజా సంఘాల నాయకులు

---



దామోదరం సంజీవయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ తదితరులు

## ఘనంగా సంజీవయ్య జయంతి

శ్రీకాకుళం కలెక్టరేట్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): దామోదరం సంజీవయ్య జయంతిని కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తొలుత దామోదరం సంజీవయ్య చిత్ర పటానికి కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో ఎం.వేంకటేశ్వరరావు, సాంఘిక సంక్షేమ శాఖ ఏడీ విశ్వ మోహన్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## 'స్వచ్ఛత'లో సిక్కోలుకు 6వ స్థానం

● జాబితా విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం

శ్రీకాకుళం అర్బన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో భాగంగా పట్టణాభివృద్ధి... పంచాయతీరాజ్ శాఖల ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన కార్యక్రమాలపై శుక్రవారం కూటమి ప్రభుత్వం జిల్లాల వారిగా ప్రగతి జాబితాలను విడుదల చేసింది. స్వచ్ఛత లక్ష్య సాధనలో రాష్ట్రంలో శ్రీకాకుళం జిల్లా 119 పాయింట్లతో 6వ స్థానంలో నిలిచింది. 129 పాయింట్లతో ఎన్టీఆర్ జిల్లా మొదటి స్థానంలో, 127 పాయింట్లతో విశాఖ 2వ స్థానం, 81 పాయింట్లతో అల్లూరి సీతారామరాజు జిల్లా చివరి స్థానంలో నిలిచాయి.



కలెక్టర్ కార్యాలయం

### ముఖ్యమంత్రి పిలుపుతో...

రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సీఎం చంద్రబాబునాయుడు స్వచ్ఛాంధ్ర లక్ష్యాల సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలని పిలుపునిచ్చారు. లక్ష్యాలను పెట్టుకోవడంతో పాటు వాటిని ఖచ్చితంగా చేరుకునేలా ప్రణాళికలు అమలు చేయాలని సూచించారు. కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశాల మేరకు శ్రీకాకుళం జిల్లాలో గడిచిన ఆరు నెలల్లో స్వచ్ఛతపై జిల్లా అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఈ క్రమంలో ఇటీవల సీఎం చంద్రబాబు ప్రతి నెల 3వ శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని అమలులోకి తీసుకొచ్చారు. దీంతో క్షేత్రస్థాయిలో స్వచ్ఛతపై శ్రీకాకుళం అధికారులు దృష్టి పెట్టారు. దీంతో ప్రభుత్వ ఉద్యోగులు తమ కార్యాలయ పరిసర ప్రాంతాలను శుభ్రం చేయడంతో పాటు బడి, గుడి, పరిశ్రమలు శుభ్రం చేసే పనిలో పడ్డారు. పాఠశాలల్లో విద్యార్థులకు స్వచ్ఛత, పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. ఈ క్రమంలో జిల్లా 6వ స్థానంలో నిలవడంపై ప్రజాప్రతినిధులు, అధికారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

---



డ్రోన్ కెమెరాకు చిక్కిన జాతీయ రహదారి పరసర ప్రాంతాల్లోని దృశ్యాలు

## డ్రోన్ డేగ చూస్తోంది

● అసాంఘిక కార్యకలాపాలపై నిఘా

శ్రీకాకుళం, క్రైం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): 'మారుమూల ప్రాంతాల్లో మేం గంజాయి తాగుతున్నాం. మమ్మల్ని ఎవరూ చూడరు.. నిర్మానుష్య ప్రదేశంలో మద్యం తాగుతున్నాం... ఎవరికీ కనిపించం. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నాం.. ఎవరి దృష్టీ మామీద ఉండదు..' అని ధీమాగా ఉండే రోజులు పోతున్నాయి. మీరు ఏ చెట్టు కింద అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా... ఏ పుట్ట వద్ద అక్రమాలు సాగించినా... డ్రోన్ డేగ చూపు నుంచి తప్పించుకోలేరు. జిల్లా కేంద్రం.. పరిసరాల్లో డ్రోన్ కెమెరాలతో పోలీసులు నిఘా పెడుతున్నారు. శ్రీకాకుళం రూరల్ మండల పరిధిలో బహిరంగంగా గంజాయి, మద్యం తాగి... చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ కెవి.మహేశ్వరరెడ్డి హెచ్చరించారు. రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలో డ్రోన్ కెమెరాల ద్వారా పటిష్ట నిఘా చర్యలు చేపట్టినట్లు ఎస్పీ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం చింతాడ, సిద్ధిపేట, నైర తదితర గ్రామాలకు ఆనుకొని ఉన్న జాతీయ రహదారి సమీప ప్రాంతాలను డ్రోన్ కెమెరాలతో జల్లెడ పట్టారు.

## దొరికితేనే దొంగలు!

(ఐదో పేజీ తరువాయి)

రేవులు నిలిపివేశారు. మిగతా ప్రాంతాల్లో ఇసుక తవ్వకాలు, సేకరణ, ఆపై రవాణా జరుగుతోంది. కానీ జిల్లాలో ఎక్కడా మాన్యువల్ పద్ధతిలో జరగడం లేదు. యంత్రాలతో తవ్వకాలు చేసి తరలిస్తున్నట్టు ఆరోపణలు న్నాయి. జిల్లా నుంచి రోజుకు సగటున 150 లారీల్లో ఇసుక విశాఖ నగరానికి తరలిస్తున్నట్టు తెలుస్తోంది. ఒక్కో లారీ ఇసుక జిల్లాలో రూ.8వేల వరకూ ఉండగా.. విశాఖలో మాత్రం రూ.20 వేలకుపైగా విక్రయిస్తున్నారు. జిల్లాలో రేవుల నుంచి నెలకు సగటున రూ.10 కోట్ల వరకూ ఇసుక విశాఖ అవసరాలకు తరలిపోతున్నట్టు ప్రచారం జరుగుతోంది. ఇప్పటికైనా పాలకులు స్పందించకపోతే కూటమి ప్రభుత్వానికి చెడ్డపేరు వచ్చే అవకాశముంది.

### ● నిఘా పెంచుతాం..

ఇసుక అక్రమ రవాణా నియంత్రణపై దృష్టి పెట్టాం. జిల్లా సరిహద్దు ప్రాంతం కావడంతో చెక్‌పోస్టు కొనసాగుతోంది. శుక్రవారం 28 లారీలను జేసీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అందులో 12 లారీలకు సంబంధించి ఎటువంటి అనుమతులు లేవు. జేసీ ఆదేశాల మేరకు ఆ ఇసుక లారీలను జేఆర్‌పురం పోలీసులకు అప్పగించాం. జిల్లా సరిహద్దు చెక్‌పోస్టులో నిఘా పెంచుతాం.

-ఎన్.ప్రసాద్, తహశీల్దారు, రణస్థలం

## కాలువల్లో పూడికతీత

బూర్జ, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): లాభాం గ్రామంలో మురుగునీటి కాలువల్లో పూడికతీత పనులు అధికారులు శుక్రవారం చేపట్టారు. లాభాం గ్రామంలో మురుగునీటి కాలువల దుస్థితిపై 'పైకప్పులు లేవు.. పూడికతీయరు' శీర్షికతో బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి స్పందించారు. దీంతో పంచాయతీ అధికారులు గ్రామంలోని మురుగునీటి కాలువల్లో పేరుకుపోయిన పూడికలు తొలగించారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

## కార్యవర్గం ఎన్నిక

ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): పంచాయతీ సెక్రటరీ గ్రేడ్-6 డిజిటల్ అసిస్టెంట్స్ మండల కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శుక్రవారం జరిగిన ఎన్నిక ప్రక్రియలో అధ్యక్షుడిగా దుర్గాసి లోకేష్, జనరల్ సెక్రటరీగా ఎస్.కృష్ణారావు, ట్రెజరర్‌గా నీరజ, ఆర్గనైజేషన్ కార్యదర్శులుగా తారకేశ్వరరావు, దీపిక ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మాట్లాడుతూ.. మండలంలో డిజిటల్ అసిస్టెంట్ల సమస్యలు పరిష్కరించడం వారి సంక్షేమానికి కృషి చేస్తానన్నారు. డిజిటల్ అసిస్టెంట్స్ ఎదుర్కొనే ప్రతి సమస్యను యూనియన్ కట్టుబడి ఉంటుందన్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎంపీడీవో రామారావు, ఈవోపీఆర్డీ కృష్ణ సిబ్బంది అభినందించారు.

## స్టెమితో గుండెకు భరోసా

ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): గుండెపోటుకు గురైనవారికి మొదటి గంట కీలకమని సకాలంలో పరీక్షలు నిర్వహించి స్టెమి చేస్తామని సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ పాతిర్ల దేవేంద్రరెడ్డి అన్నారు. శుక్రవారం సీహెచ్‌సీలో స్టెమీ గుండె భరోసాపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ.. గుండెపోటుకు గురైన పేషెంట్స్‌కు అత్యవసర పరిస్థితుల్లో అందించే రూ.45 వేలు విలువ చేసే ఇంజక్షన్ ఉచితంగా అందిస్తామన్నారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

## ఫలితాలు విడుదల

గుజరాతీపేట, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ఈ విద్యా సంవత్సరంలోని డిగ్రీ మొదటి, మూడో సెమిస్టర్ ఫలితాలను విడుదల చేసినట్టు ప్రిన్సిపాల్ కె.సూర్యచంద్రరావు, కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినర్ టి.ఆదిలక్ష్మి తెలిపారు. మొదటి సెమిస్టర్ బీఏలో 37.41 శాతం, బీకామ్‌లో 50.31 శాతం, బీఎస్సీలో 71.90 శాతం ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. అలాగే మూడో సెమిస్టర్‌కు సంబంధించి బీఏలో 70.71 శాతం, బీకామ్‌లో 79.28 శాతం, బీఎస్సీలో 73.14 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు.

## బలోపేతం చేద్దాం

కంచిలి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఉపాధ్యాయులంతా కృషిచేయాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు అన్నారు. మండల క్షేత్రంలో యూటీఎఫ్ నాయకులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం విద్యారంగాన్ని సంస్కరణల పేరుతో విద్యను ప్రైవేటీ కరణ చేసే పని చేపడుతున్నాయని, వాటిని తిప్పికొట్టాలన్నారు. గత వైసీపీ ప్రభుత్వం 117 జీవో తీసుకువచ్చి విద్యావ్యవస్థను విచ్ఛిన్నం చేసిందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిశోర్‌కుమార్, నాయకులు జయచంద్రరెడ్డి, వివిధ సంఘాల ప్రతినిధులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## బాధితుడికి ఆర్థిక సాయం

కవిటి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): బల్లిపుట్టుగ గ్రామానికి చెందిన బచ్చల తేజ గత కొంత కాలంగా కిడ్నీవ్యాధితో బాధపడుతున్నాడు. వారానికి మూడుసార్లు డయాలసిస్ తప్పనిసరి కావడంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకున్న కేశుపురం గ్రామానికి చెందిన కాశీమాత సేవా సమితి రూ.15వేలు సాయం అందించారు. కార్యక్రమంలో సమితి సభ్యులు పాల్గొన్నారు.

## నియమాలు పాటించాలి

అరసవల్లి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని హోటళ్లు, రెస్టారంట్లలో ఆహార భద్రతా నియమాలు పాటించాలని జిల్లా ఆహార నియంత్రణాధికారి కె.వెంకటరత్నం అన్నారు. స్థానిక 80 అడుగుల రోడ్డులోని హోటళ్లు, రెస్టారెంట్లను ఆయన శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా హోటల్, రెస్టారెంట్‌లో తయారైన ఆహార పదార్థాల సాంపిళ్లను సేకరించి, నాణ్యతా పరిశీలనకు పంపిస్తామన్నారు. ఆహార పదార్థాల సరఫరాపై వారికి పలు సూచనలు చేసారు. ఫుడ్ సేఫ్టీ అధికారి కె.లక్ష్మి పాల్గొన్నారు.

## పక్కాగా తనిఖీలు చేపట్టాలి

జి.సిగడాం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నిర్వహించనున్న ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీలు పక్కాగా నిర్వహించాలని ఎంపీడీవో గుంటముక్కల రామకృష్ణ అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఉపాధి సిబ్బంది సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మండలంలో 31 పంచాయతీల్లో 2023-24 ఏడాదికి గాను రూ.21.69 కోట్ల మేర వేతనాలు, మెటీరియల్ రూపంలో పనులు చేస్తున్నట్టు తెలిపారు. పంచాయతీరాజ్, గృహనిర్మాణ, ఉపాధి పనులకు సంబంధించి గ్రామాల్లో సామాజిక తనిఖీలు చేయాలన్నారు. సమావేశంలో ఏపీవో చోళ్ల సత్యనారాయణ, ఈసీ జి.పురుషోత్తమరావు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

# పెండింగ్ కేసులు తగ్గించాలి

- జిల్లా న్యాయాధికారి జునైద్ అహ్మద్ మౌలానా
- 8న జాతీయ లోక్ అదాలత్



సమావేశంలో పాల్గొన్న పోలీసు, ఇన్సూరెన్స్ అధికారులు, న్యాయవాదులు

గుజరాతీపేట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): పెండిగ్‌లో ఉన్న కేసులు తగ్గించేందుకు కృషి చేయాలని జిల్లా న్యాయాధికారి జునైద్ అహ్మద్ మౌ లానా అన్నారు. స్థాని క జిల్లా కోర్టు భవనంలో శుక్రవారం పోలీసు అధికారులు, ఇన్సూరెన్స్ కంపెనీలు, న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన న్యాయమూర్తి మాట్లాడుతూ.. వచ్చే నెల 8న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ చేయించాలని సూచించారు. ఇరు వర్గాలకు రాజీ వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించి వారి మధ్య మంచి సంబంధం నెలకొల్పేలా చూడాలన్నారు. మోటారు వాహనాల ప్రమాద కేసుల్లో ఇన్సూరెన్స్ కంపెనీలు త్వరితగతిన బాధితులకు, వారి కుటుంబాలకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా న్యాయాధికారులు సీహెచ్ వివేక్ ఆనంద్ శ్రీనివాస్, ఎస్ఎల్ ఫణికుమార్, కేవీఎల్ హిమబిందు, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు, ఏఎస్పీ పి.శ్రీనివాసరావు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, న్యాయవాది మంచు జనార్దనరావు, ఇన్సూరెన్స్ కంపెనీల ప్రతినిధులు, పలువురు న్యాయవాదులు, పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# భారీగా గంజాయి పట్టివేత

- ఇచ్ఛాపురంలో 18.3 కిలోలు.. కంచిలిలో 2.08 కిలోలు
- ఈ రెండు ఘటనల్లో ఐదుగురి అరెస్టు
- వివరాలు వెల్లడించిన కాశీబుగ్గ డీఎస్పీ వెంకటప్పారావు



మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటప్పారావు

ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): వేర్వేరు ఘటనల్లో భారీగా గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. ఈ ఘటనల్లో ఐదురుగురిని అరెస్టు చేశారు.

ఒడిశాలో కొనుగోలు చేసిన గంజాయిని ఇచ్ఛాపురం రైల్వే స్టేషన్ మీదుగా బెంగళూరుకు తరలించేందుకు సిద్ధమవుతున్న ఇద్దరు వ్యక్తులను పట్టణ పోలీసులు పట్టుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను శుక్రవారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో కాశీబుగ్గ డీఎస్పీ వెంకటప్పారావు వెల్లడించారు. కర్ణాటక రాష్ట్రం బెంగళూరుకు చెందిన ముజామిల్, మహ్మద్ సిరా జుద్దీన్ గంజాయికి బానిస వడంతోపాటు గంజాయి వ్యాపారం చేస్తున్నారు. ఈ క్రమంలో ఒడిశా రాష్ట్రం ఖందమాల్ జిల్లా, ఫుల్బాని ప్రాంతంలో ఉంటున్న భరత్ డిహాల్ వద్ద సుమారు 18.3 కిలోల గంజాయిని కొనుగోలు చేశారు. దీనిని బెంగళూరుకు తరలించేం దుకు బస్సులో బరంపురం మీదుగా ఇచ్ఛాపురం బస్టాండ్‌కు, అక్కడి నుంచి బెంగళూరు వెళ్లేందుకు రైల్వేస్టేషన్‌కు చేరుకున్నారు. అనుమానితులుగా కనిపించడంతో పోలీసులు వాళ్లను తనిఖీ చేయగా.. గంజాయి ఉన్నట్టు గుర్తించారు. ఈ గంజాయిని బెంగళూరుకు చెందిన విజయ్‌కుమార్‌కు అమ్మేందుకు తీసుకెళ్తున్నట్టు విచారణలో చెప్పారు. పట్టుబడిన వీరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని డీఎస్పీ తెలిపారు. సీఐ మీసాల చిన్నమనాయుడు, పట్టణ ఎస్ఐ ముకుందరావు ఉన్నారు.

## రైలు నిలయం వద్ద రెండు కిలోలు..

కంచిలి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రైలు నిలయం సమీపంలో శుక్రవారం సాయంత్రం ముగ్గురు వ్యక్తులు గంజాయి విక్రయిస్తుండగా అదుపులోనికి తీసుకుని, వారి నుంచి రెండు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్టు కాశీబుగ్గ డీఎస్పీ వి.వెంకటప్పారావు తెలిపారు. ఈ మేరకు కంచిలి పోలీస్ స్టేషన్‌లో సోంపేట సీఐ బి.మంగరాజు, కంచిలి ఎస్ఐ పి.పారినాయిడుతో కలిసి శుక్రవారం రాత్రి విలేకరులతో మాట్లాడారు. తమిళనాడుకు చెందిన అజిత్ అనే లారీ క్లీనర్ తరచూ లోడింగ్‌తో చెన్నై నుంచి కోలకత్తా వెళ్తుండేవాడు. ఈ క్రమంలో ఒడిశా రాష్ట్రం సుర్ల జంక్షన్ వద్ద సోమేష్ అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. సోమేష్ డ్రైవర్‌కు క్లీనర్లకు గంజాయి అమ్ముతుండేవాడు. అజిత్ గంజాయి పొట్లాలను సోమేష్ నుంచి తీసుకువెళ్లి చెన్నైలో విక్రయించేవాడు. ఈ క్రమంలో తన స్నేహితుడు కమలుద్దీన్‌కు ఈ గంజాయి వ్యాపారం గురించి వివరించాడు. దీంతో వాళ్లిద్దరూ పెద్ద మొత్తంలో గంజాయిని విక్రయించేందుకు సోమేష్‌తో మాట్లాడారు. ఈ క్రమంలో సోమేష్ నుంచి రెండు కిలోల గంజాయిని కొనుగోలు చేసేందుకు తన స్నేహితుడు కమలుద్దీన్‌తో కలిసి అజిత్ ఈనెల 11న చెన్నైలో బయలుదేరారు. 13వ తేదీ ఉదయం సోమేష్‌కి రూ.20వేలు అందించి రెండు కిలోల గంజాయి కావాలని చెప్పగా.. అతడు శుక్రవారం సాయంత్రం కంచిలి రైల్వే నిలయం సమీపంలో ఉంటే సరుకు అక్కడికి తెచ్చి ఇస్తానని వారితో చెప్పాడు. దీంతో శుక్రవారం సాయంత్రం కంచిలి రైలు నిలయం వద్దకు ముగ్గురు వచ్చారు. ఎస్ఐ పారినాయిడు సిబ్బందితో కలిసి తనిఖీలు చేస్తుండగా పట్టుబడ్డారు. వారి నుంచి 2.08 కిలోల గంజాయితోపాటు రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్టు డీఎస్పీ తెలిపారు.

## బాల్య వివాహాలు అరికట్టేందుకు కృషి చేయాలి: కలెక్టర్

శ్రీకాకుళం కలెక్టరేట్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాల అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారులతో ఆయన శుక్రవారం సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. టీనేజీ ప్రెగ్నెన్సీలు నమోదుకావడానికి గల కారణాలను ప్రతీ సీడీపీవో విశ్లేషణ చేసి కేస్ స్టడీతో వచ్చే నెల జరిగే సమీక్షకు హాజరు కావాలని ఆదేశించారు. 0-6 సంవత్సరాల మధ్య వయసు గల పిల్లలందరికీ ఆధార్ కార్డులు వచ్చేలా చూడాలన్నారు. గ్రామ స్థాయిలో బాలల సంక్షేమం, మహిళా రక్షణ కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ బి.శాంతిశ్రీ, డీసీపీవో కేవీ రమణ, సీడీపీవోలు, చిల్డ్రన్ హోమ్ సిబ్బంది పాల్గొన్నారు.

## రెవెన్యూ సమస్యలు పరిష్కరించాలి



రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో సాయిప్రత్యూష

ఎచ్చెర్ల, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ గ్రామసభల్లో వచ్చిన సమస్యలను పరిష్కరించాలని ఆర్డీవో కె.సాయి ప్రత్యూష అన్నారు. ఎస్ఎం పురం గ్రామాన్ని శుక్రవారం సందర్శించి దరఖాస్తుల పరిష్కారానికి రెవెన్యూ సిబ్బంది, రైతులతో క్షేత్రస్థాయిలో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రెవెన్యూ గ్రామ సభల్లో 100 కంటే ఎక్కువ దరఖాస్తులు వచ్చిన గ్రామాల్లోని సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. క్షేత్రస్థాయిలో ఉన్న వాస్తవ సర్వే నెంబరు, రికార్డుల్లో సర్వే నెంబర్లలో తేడాలు ఉన్నాయని పలువురు పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ బి.గోపాలరావు, టీడీపీ జిల్లా మాజీ అధ్యక్షుడు చౌదరి నారాయణమూర్తి, బీజేపీ నియోజకవర్గ కో కన్వీనర్ సంపతిరావు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## రహదారి భద్రతపై జాగ్రత్తలు తీసుకోవాలి



అవగాహన ర్యాలీలో పాల్గొన్న ఉద్యోగులు

అరసవల్లి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): రహదారి భద్రతపై జాగ్రత్తలు తీసుకోవాలని ఆర్టీసీ శ్రీకాకుళం 1,2 డిపో మేనేజర్లు అమరసింహుడు, రవిశంకర్ శర్మ పిలుపునిచ్చారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా శ్రీకాకుళం బస్టాండ్ నుంచి స్థానిక ఏడు రోడ్ల జంక్షన్ వరకు ఆర్టీసీ అధికారులు భద్రతా అవగాహనా ర్యాలీని శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో 40 మంది సిబ్బందితో పాటు కళాశాలల విద్యార్థులు, అసోసియేషన్ నాయకులు, పీఆర్వో సుమన్ తదితరులు పాల్గొన్నారు.

## ఫిర్యాదులపై పలాస ఆర్డీవో సమీక్ష

కంచిలి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): జాడుపూడి సచివాలయాన్ని శుక్రవారం సాయంత్రం పలాస ఆర్డీవో జి.వెంకటేష్ సందర్శించారు. ఈ సందర్భంగా ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చిన సమస్యలపై సచివాలయ అధికారులతో సమీక్షించారు. ప్రజల నుంచి వచ్చిన వినతులు సంబంధిత శాఖలకు పంపించి వెంటనే పరిష్కారం జరిగేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎన్.రమేష్‌కుమార్, డీటీ సంతోష్, వీఆర్‌వోలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## అమరవీరులకు నివాళులు



కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పిస్తున్న విద్యార్థులు

కవిటి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): పుల్వామా దాడిలో అమరులైన సైనికులకు ఎర్రగోవిందపుట్టుగ పాఠశాల విద్యార్థులు కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## రైతు విశిష్ట గుర్తింపు నమోదు చేసుకోవాలి



వేల్పురాయి సచివాలయంలో నమోదు చేసుకుంటున్న రైతులు

రణస్థలం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ప్రతి రైతు విశిష్ట గుర్తింపు సంఖ్యను నమోద చేసుకుని ప్రభుత్వ పథకాలు పొందాలని జిల్లా వ్యవసాయ అధికారి కోరాడ త్రినాథరావు అన్నారు. శుక్రవారం వెల్పురాయి గ్రామంలో జరిగిన విశిష్ట సంఖ్య గుర్తింపు నమోదు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. పీఎం కిసాన్, పెట్టుబడి సాయం, పంటల బీమా, సూక్ష్మ నీటిపారుదల పథకం పొందాలంటే విధిగా విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు అవసరమన్నారు. కార్యక్రమంలో ఏడీఏ భవానీశంకర్, వ్యవసాయాధికారి విజయ్‌భాస్కర్, పలువురు రైతులు పాల్గొన్నారు.

- ఎచ్చెర్ల, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు మండల వ్యవసాయాధికారి వై.సురేష్ అన్నారు. పొన్నాడలో శుక్రవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పీఎం కిసాన్ చెల్లింపులు, పెట్టుబడి సాయం, పంటల బీమా, రాయితీపై సూక్ష్మపోషకాలు, వ్యవసాయ యంత్ర పరికరాలు, అన్నదాత సుఖీభవ, పంట రుణాలపై వడ్డీ రాయితీ, సూక్ష్మ సేద్యంపై రాయితీ పొందాలంటే 11 అంకెల విశిష్ట సంఖ్య నమోదు చేసుకోవాలన్నారు. రైతులు ఆధార్ కార్డు, మొబైల్, పట్టాదారు పాసుపుస్తకం తీసుకుని ఈ నెలాఖరులోగా నమోదు చేసుకోవాలన్నారు.

## ఎఫ్‌డీఐ ప్రతిపాదన రద్దు చేయాలి



ఆందోళన చేస్తున్న ఇన్సూరెన్స్ పెన్షనర్ల అసోసియేషన్ సభ్యులు

అరసవల్లి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ఇన్సూరెన్స్ రంగంలో 100శాతం విదేశీ పెట్టుబడులను అనుమతించాలని కేంద్ర ప్రభుత్వం చేసిన ప్రతిపాదనను వెంటనే రద్దు చేయాలని ఇన్సూరెన్స్ పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు స్థానిక లైఫ్ ఇన్సూరెన్స్ కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా చేశారు. ఈ చర్యతో దేశంలో పాలసీదారులకు తీవ్ర నష్టం కలుగుతుందని. ఇది విదేశీ పెట్టుబడిదారులను సంతృప్తి పరిచేందుకేనన్నారు. పాలసీదారుల సొమ్మును విదేశాలకు తరలించే ప్రమాదం ఉందని, ఈ నిర్ణయం సరికాదని విమర్శించారు. కార్యక్రమంలో కె.నారాయణ, ఎం.ప్రభాకరరావు, కె శ్రీనివాస్, అచ్యుతరావు, పరిమళ, మూర్తి, కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి సిబ్బందిపై వేధింపులు సరికాదు



డీఆర్వోకు వినతిపత్రాన్ని అందజేస్తున్న జేఏసీ నాయకులు

శ్రీకాకుళం కలెక్టరేట్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న సిబ్బందిని వేధింపులకు గురిచేయడం సరికాదని, ఈ విధానాన్ని తక్షణం విడనాడాలని ఉద్యోగులు కోరారు. ఈ మేరకు ఉపాధి పథకంలోని వివిధ కేడర్లకు చెందిన ఉద్యోగులు డ్వామా పీడీ బి.సుధాకరరావుకు డీఆర్వో ఎం.వెంకటేశ్వరరావుకు వేర్వేరుగా శుక్రవారం వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు వీవీ రమణ, అమ్మినాయుడు, జయరాం, తవిటినాయుడు, తెంబూరు రవి, అరుణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సీతారాములకు ప్రత్యేక పూజలు

జి.సిగడాం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): రామాలయం ప్రారంభోత్సవంలో భాగంగా నాగులవలసలో శుక్రవారం సీతారాములకు ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో వేదపండితులు మంత్రాల నడుమ రుద్ర, లక్ష్మీగణపతి, మృత్యుంజయ హోమాలు తదితర పూజా కార్యక్రమాలు జరిపించారు. సాయంత్రం పలు జంటలతో ప్రత్యేక పూజలు చేశారు.



సీతారాముల చిత్ర పటాలను ఊరేగిస్తున్న భక్తులు



## రోడ్డు ప్రమాదంలో ఒడిశావాసి మృతి



అభిషేక్‌ను ఆసుపత్రికి తరలిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ఫరీద్‌పేట పంచాయతీ కొయ్యరాళ్ల జంక్షన్‌కు సమీపంలో జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన ప్రమాదంలో ఒడిశా వాసి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఒడిశా రాష్ట్రం బాలాసూర్ (ఖుర్దా)కు చెందిన అభిషేక్ బెహరా(40) తన భార్య అన్నయ పాత్రోతో కలిసి ద్విచక్ర వాహనంపై బెంగళూరు వెళ్తుండగా బైక్ అదుపు తప్పి బోల్తాపడ్డారు. ఈ ఘటనలో అభిషేక్ బెహరా తీవ్రంగా గాయపడగా, అన్నయ పాత్రోకు కాలు విరిగింది. 108 వాహనంలో శ్రీకాకుళం సర్వజనాసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ అభిషేక్ బెహరా మృతి చెందాడు. ఎచ్చెర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## గర్వించదగ్గ గాయకుడు 'ఘంటసాల'

శ్రీకాకుళం కల్చరల్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ఘంటసాల ప్రపంచమంతా గర్వించదగ్గ గాయకుడిని, ఆయన తెలుగువాడిగా పుట్టడం మనందరికి గర్వకారణమని.. అటువంటి మహనీయుడి జీవిత చరిత్రను నేటి తరానికి పరిచయం చేయాలనే సంకల్పంతో ఘంటసాల ది గ్రేట్ సినిమా అందించినట్టు దర్శకుడు రామారావు అన్నారు. ఆ సినిమా విడుదల సందర్భంగా శుక్రవారం ఆయన స్థానిక ఓ థియేటర్‌ను సందర్శించి మాట్లాడారు. ప్రముఖ తెలుగు చలనచిత్ర నేపథ్య గాయకుడు, సంగీత దర్శకుడు ఘంటసాల వేంకటేశ్వరరావు జీవిత పోరాటాలను, సాధించిన విజయాలను చిత్రంగా మలచి ఆయన విలువలు, భవిష్యత్ తరాలను అందించాలనే ముఖ్య ఉద్దేశ్యంతో ఈ చిత్రాన్ని అందించామన్నారు. ప్రతి ఒక్కరూ ఈ చిత్రాన్ని చూడాలని ఆయన కోరారు. అనంతరం చిత్ర యూనిట్ సభ్యులను సత్కరించారు.

## బారువలో విస్తృతంగా తనిఖీలు

సోంపేట, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ఇటీవల కాలంలో గంజాయి రవాణా, దొంగతనాలు వంటి క్రైమ్‌రేట్ పెరిగిపోతుండటంతో ముందస్తు జాగ్రత్తగా పోలీసులు బారువలో శుక్రవారం తనిఖీలు చేశారు. ఎస్ఐ హరిబాబు నాయుడు ఆధ్వర్యంలో పోలీస్ జాగిలంతో బారువలోని షాపులను తనిఖీ నిర్వహించారు.

## మైనర్ మీడియం పాఠశాలలను కొనసాగించాలి

ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ఉర్దూ, ఒడియా, తమిళ, కన్నడ తదితర మైనర్ మీడియం పాఠశాలలను యథావిధిగా కొనసాగించాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం బాలికోన్నత పాఠశాలలో యూటీఎఫ్ నాయకులతో సమావేశం నిర్వహించారు. 2020 విద్యాహక్కు చట్టం ప్రకారం 8వ తరగతి వరకు మాతృభాషలోనే విద్యను అభ్యసించాలనే నిబంధన ఉన్నప్పటికీ వీటిని తప్పకుండా అమలు చేయాలన్నారు. మైనర్ మీడియం బోధిస్తున్న ఉపాధ్యాయులను పాఠశాల కాంప్లెక్స్ సమావేశాలు ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలన్నారు. మున్సిపల్ ఉన్నత పాఠశాలలోని అన్ని పోస్టులు అప్‌గ్రేడ్ చేయాలన్నారు. జిల్లా అధ్యక్షుడు ఎల్.బాబూరావు, జిల్లా కార్యదర్శి మాధవరావు, పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రకాష్‌రెడ్డి, సాయికృష్ణ, మురళీధర్, భాస్కర్, సంతోష్, శంకర్ పాల్గొన్నారు.

## సంఘం నిర్వహణపై విచారణ జరిపించాలి

సోంపేట, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): రజక సంఘ నిర్వహణపై విచారణ జరిపించాలని ఆ సంఘ మాజీ అధ్యక్షుడు కొత్తపల్లి నాగరాజు కోరారు. ఈ మేరకు పట్టణంలో శుక్రవారం సంఘ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. గతంలో ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. ప్రస్తుత అధ్యక్షుడు ఎం.ధర్మారావు ఇప్పటివరకు జరిగిన లావాదేవీలు అడుగుతున్నా ఇవ్వడంలేదని ఆరోపించారు. సంఘ భవనాన్ని కూడా ఉపయోగించనివ్వడం లేదన్నారు. వీటిపై విచారణ చేసి న్యాయం చేయాలని పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. కాగా ఆ సంఘ అధ్యక్షుడు ధర్మారావు మాట్లాడుతూ.. సంఘ నిర్వహణలో ఎటువంటి అవకతవకలు జరగలేదన్నారు. లెక్కలన్నీ చూపించేందుకు తాను సిద్ధంగా ఉన్నానన్నారు. ఫిర్యాదుదారుడే గతంలో అధ్యక్షుడిగా ఉన్నప్పుడు జరిగిన లావాదేవీల వివరాలు అప్పజెప్పకుండా ఇతరులపై నిందలు మోపుతున్నారన్నారు. భవనం తాళాలు గుమస్తా వద్ద ఉంటాయని, ఇందులో ఎటువంటి వివక్షలేదని అన్నారు.

## ఎక్కువ కేసుల రాజీకి కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న న్యాయాధికారి కిశోర్

సోంపేట, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 8న జరగనున్న లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ అయ్యేలా కృషిచేయాలని మండల న్యాయ సేవా సంఘం అధ్యక్షుడు, ఆరో అదనపు జిల్లా న్యాయాధికారి కె.కిశోర్ కోరారు. పోలీస్ అధికారులతో కోర్టు ప్రాంగణంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలు తెలుసుకుని, వాటిలో పరిష్కారమయ్యే కేసులపై ఆరా తీశారు. సమావేశంలో డీఎస్పీ వి.వెంకటప్పారావు, ఏపీపీ ఎస్.నరేష్, సోంపేట, కంచిలి, బారువ ఎస్ఐలు పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమానికి పాటుపడాలి

శ్రీకాకుళం రూరల్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అందిస్తున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసేందుకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని రూరల్ మండల బీజేపీ అధ్యక్షుడు రుప్ప బాలకృష్ణ పిలుపునిచ్చారు. జిల్లా మండల అధ్యక్షుడి ఆధ్వర్యంలో శుక్రవారం మండల కమిటీని ప్రకటించారు. ఈ కమిటీలో ఎన్నుకోబడిన సభ్యులు ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు ప్రజలందరికీ సంక్షేమ కార్యక్రమాలందేలా చూడాలని కోరారు. నాయకులు చల్లా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## అన్యాయం చేస్తే పోరాడతాం

సరుబుజ్జిలి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ఆదివాసీలకు అన్యాయం చేస్తే పోరాటం తప్పదని జడ్పీటీసీ సురవరపు నాగేశ్వరరావు, ఆదివాసీ హక్కుల పరిరక్షణ కమిటీ నాయకులు వాబ యోగి, ఆమదాలవలస నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త చింతాడ రవికుమార్ అన్నారు. బూర్జ, సరుబుజ్జిలి మండలాల పరిధిలో థర్మల్ పవర్ ప్రాజెక్టును నెలకొల్పనున్న నేపథ్యంలో వారు వెన్నెలవలస గ్రామాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆ గ్రామస్థుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. వైసీపీ నాయకలు దుంపల శ్యామలరావు, సురేష్‌దర, సింహాచలం, అన్నారావు తదితరులు ఉన్నారు.

## లైఫ్ సర్టిఫికెట్లు అందజేయాలి

రణస్థలం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): రిటైర్డు ఉద్యోగులు ఈనెల 28వ తేదీలోగా లైఫ్ సర్టిఫికెట్లు ట్రెజరీకి అందజేయాలని ఆ సంఘం నాయకులు పి.నరసింహులనాయుడు, మహంతి రమణ అన్నారు. రణస్థలం, లావేరు, ఎచ్చెర్ల మండలాల పరిధిలోని 119 మంది రిటైర్డు ఉద్యోగులు రణస్థలం ట్రెజరీకి లైఫ్ సర్టిఫికెట్లు అందజేయాలని, లేకుంటే పెన్షన్ నిలిపివేస్తారన్నారు.

# షెడ్ లేక.. చెట్ల కింద

● గార జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో సైకిళ్ల పార్కింగ్

గార, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): గార జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో షెడ్ లేకపోవడంతో విద్యార్థులు సైకిళ్ల పార్కింగ్ చేసుకోవడానికి అవస్థలకు గురవుతున్నారు. దీంతో చెట్ల కింద, ఆరుబయట ఉంచుతున్నారు. ఇక్కడ చుట్టూ పక్కల గ్రామాల్లోని వందలాది మంది విద్యార్థులు చదువుకో వడానికి సైకిళ్లపై వస్తుంటారు. ఈ రూట్‌లో సరిపడా ఆర్టీసీ బస్సులు లేకపోవడంతోపాటు గ్రామాల నుంచి ప్రజా రవాణా సదుపాయాలు లేకపోవడంతో సైకిళ్లపైనే చేరుకోవ ల్సివస్తోంది. ఈ నేపథ్యంలో సైకిళ్ల భద్రపర చడానికి ఇక్కడ షెడ్ లేకపోవడంతో ఆరుబయట, చెట్ల కింద ఉంచడం వల్ల ఎండకు ఎండి వర్షానికి తడిచి త్వరగా పాడవుతున్నాయి.దీంతో తరచూ సైకిల్ మెకానిక్ దగ్గరకు వెళ్లాల్సివస్తోందని విద్యార్థులు వాపోతున్నారు. తక్షణమే సైకిళ్ల ఉంచేందుకు షెడ్ నిర్మించాలని పలువురు కోరుతున్నారు.



పాఠశాల ఆవరణలో చెట్ల కింద నిలిపిన సైకిళ్లు

# సమన్వయం లేక.. స్తంభాలు మార్చక

●వాహన చోదకుల అగచాట్లు ●ఇదీ సీతారాంపల్లి రైల్వే అండర్ పాసేజ్ వద్ద పరిస్థితి

పాతపట్నం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): పాతపట్నం- తెంబూరు రోడ్డులో సీతారాంపల్లి సమీపంలో రైల్వేలైన్ ఆనుకుని నిర్మించిన రైల్వే అండర్‌పాస్ రోడ్డులో అడ్డంగా ఉన్న విద్యుత్ స్తంభాల తొలగింపు విషయంలో అధికారుల మధ్య సమన్వయం లోపించింది. దీంతో వాహనచోదకులు, ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు.

పాతపట్నం- తెంబూరు రోడ్డులో సీతారాంపల్లి సమీపంలో నాలుగేళ్ల కిందట రైల్వే అండర్‌పాస్ నిర్మించారు. అయితే ఇక్కడ రోడ్డు మధ్యలో మూడు స్తంభాలను విడిచిపెట్టారు. నిర్మాణం తర్వాత ఆర్‌అండ్‌బీ రోడ్డుకు కనెక్ట్‌చేశారు.దీంతోఈ మార్గంలో వచ్చి పోయే వాహనాలు దగ్గరకు చేరే వరకూ ఎదురుగా వస్తున్నట్లు గుర్తించలేకపోతున్నారు. దీంతో ఈప్రదేశంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రధానంగా ఈ రైల్వే పాస్ నిర్మించే సమయంలో రైల్వే, విద్యుత్, ఆర్ అండ్‌బీశాఖల అధికారులు సమన్వయంతో స్తంభాల మార్పిడిచేయాల్సిఉంది. అయితే ఆయా శాఖల అధికారుల మధ్య సమన్వయం లేకపోవడంతో విద్యుత్ స్తంభాలు రోడ్డు మధ్యనే విడిచిపెట్టి రోడ్డును నిర్మించారు. స్తంభాలకు ఆనుకొనిఉన్న ప్రదేశంలో పిచ్చిమొక్కలు, తుప్పలుబాగా పెరిగిపోయాయి.దీంతోఇక్కడ ఎదురుగా వచ్చే వాహనాలు దగ్గరకు వచ్చే వరకూ గుర్తించలేని పరిస్థితి నెలకొంది.దీంతో ఇక్కడ తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనచోదకులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. పలు సార్లు అధికారుల దృష్టికి ఈ సమస్యను తీసుకువెళ్లినా ఫలితం లేకుండాపోయిందని సీతారాంపల్లి తదితర గ్రామస్థులు వాపోతున్నారు. తక్షణమే కూటమి ప్రభుత్వం స్తంభాల తొలగింపునకు చర్యలు తీసుకోవాలని పలువురు వాహనచోదకులు కోరుతున్నారు. కాగా విద్యుత్‌స్తంభాలు తెలగించడానికి కాంట్రాక్టర్ ట్రాన్స్‌కోకు డబ్బులు చెల్లించకుండా రైల్వేశాఖ అధికారులు బిల్లులను చెల్లించారని తెలిపారు.ఈనేపథ్యంలో ఇటీవల ఎమ్మెల్యేనిర్వహించిన ప్రజాదర్బార్‌లో ట్రాన్స్‌కో అధికారులు ఈసమస్య పరిష్కరిస్తామని పేర్కొన్నారు.



రైల్వే పాసేజ్ వద్ద రోడ్డుపై అడ్డంగా ఉన్న స్తంభాలు



దివంజిపేట రోడ్డులో ఏర్పడిన భారీ గుంత

# పనులు పూర్తికాక.. ప్రయాణికుల పాట్లు

●అడుగడుగునా గోతులమయం ●ఇదీ దివంజిపేట రోడ్డు పరిస్థితి

ఆమదాలవలస, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి):మండలంలోని సైలాడ పంచాయతీ పరిధిలో గల దివంజిపేట రోడ్డు పనులు పూర్తికాకపోవడంతో వాహనచోదకులు, ప్రయాణికులు అవస్థలకు గురవుతున్నారు. 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వం 1.60 కోట్ల రూపాయల ఏఐఐబీ నిధులు మంజూరుచేసింది. పంచాయతీరాజ్‌శాఖ ఆధ్వర్యంలో అలికాం- బత్తిలి ప్రధాన రహదారి నుంచి దివంజిపేట మీదుగా సైలాడ వరకు సీసీ రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపట్టారు. అప్పటి ఎమ్మెల్యే కూన రవికుమార్ 2018 డిసెంబర్ 26న శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. పనులు చేపట్టిన కాంట్రాక్టర్ గ్రావెల్ స్టోన్ క్రషర్‌వేశారు. ఇంతలో 2019 ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రహదారి పనులు పూర్తిగా నిలిచిపోయాని గ్రామస్థులు చెబుతున్నారు. ప్రస్తుతం ఈ రోడ్డులో అడుగడునా ఏర్పడిన గోతుల్లో వర్షం నీటితో నిండి చెరువులను తలపిస్తున్నాయి. చీకటిపడిన తర్వాత గోతుల్లో పడిగాయపడుతున్నామని ద్విచక్రవాహనచోదకులు వాపోతున్నారు.కాగా ప్రధాన సమస్యను పరిష్కరించాలని అప్పట్లో ఎమ్మెల్యే తమ్మినేని సీతారాం దృష్టికి తీసుకువెళ్లినా ప్రయోజనం లేకపోయిందని సర్పంచ్ సైలాడ దాసునాయుడు తెలిపారు.



# ఉద్యోగాల పేరుతో మోసం

● నిద్రమాత్రలు మింగడంతోపాటు పెట్రోల్ పోసుకున్న బాధితురాలు

● టెక్కలి గొల్లవీధిలో బాధిత కుటుంబ సభ్యుల నిరసన

టెక్కలి, ఫిబ్రవరి14(ఆంధ్రజ్యోతి):టెక్కలి గొల్లవీధికి చెందిన గోపిదొలై దమయంతి కోడలు గాయత్రి తమ దివ్యాంగులైన పిల్లలకు రైల్వేలో ఉద్యోగాలు ఇప్పిస్తామని రూ.18 లక్షల60 వేలు తీసుకొని టోకరా పెట్టిందని బాధితులు నిరసనకు దిగారు. ఆమె ముఖం చాటేసిందని పేర్కొని మోసానికి గురైన సంతబొమ్మాళికి చెందిన పందిరి అప్పమ్మ,సన్యాసమ్మ పిల్లలు శ్రావణి, కార్తీక్ ఆందోళనకు దిగారు. శుక్రవారం గొల్లవీధిలో గాయత్రి ఇంటి ఎదుట ధర్నా చేశారు. ఆ సమయంలో సన్యాసమ్మ నిద్రమాత్రలు మింగేసింది. కొంత సేపటి తర్వాత ఒంటిపై కిరోసిన్ పోసుకుంది. ఈసమయంలో గాయత్రి కుటుంబానికి, సన్యాసమ్మ కుటుంబానికి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు సన్యాసమ్మను జిల్లా కేంద్రాసుపత్రికి తరలించారు. బాధితుల కథనం మేరకు.. సంతబొమ్మాళికి చెందిన పందిరి సన్యాసమ్మ ఊరూవాడా తిరుగుతూ గాజులు, పూసలు విక్రయించి జీవిస్తోంది. ఈక్రమంలో టెక్కలి గొల్లవీధికి చెందిన దమయంతి కుటుంబంతో పరిచయం ఏర్పడింది. ఈప్రాంతంలో లక్షకు పదిరూపాయలు వడ్డీ ఇస్తున్నారని, ముందుగా రూ.పదివేలు తీసుకుని రూ.90వేలు ఇన్వేచాలని దమయంతి సన్యాసమ్మకు చెప్పింది. దీంతో సన్యాసమ్మ విడతల వారీగా దమయంతి కోడలు గాయత్రి బ్యాంకు ఖాతాలో జమచేసింది.ఆ పరిచయంలో భాగంగా సన్యాసమ్మ ఇద్దరు పిల్లలకు ఉద్యోగాలిప్పిస్తానని దమయంతి, గాయత్రి నచ్చజెప్పడంతో అందుకు సన్యాసమ్మ తలఊపింది. చివరకు ఉద్యోగాలు లేకపోవడం, ఇటు వడ్డీ డబ్బులు రాకపోవడంతో సన్యాసమ్మ గతఏడాది నవంబరు 20న సంతబొమ్మాళి పోలీస్‌స్టేషన్‌లో గాయత్రిపై ఫిర్యాదు చేసింది. దీంతో అప్పట్లో తాను తీసుకున్న డబ్బులు తగు సమయంలో తిరిగి ఇచ్చేందుకు అంగీకారపత్రం గాయత్రి సన్యాసమ్మకు రాసిచ్చింది. గడువు దగ్గరవుతుండడంతో సన్యాసమ్మ గాయత్రిని అడుగు తోంది. వారి నుంచి సమాధానం రాకపోవడంతో సన్యాసమ్మ శుక్రవారం భర్త, పిల్లలతో గొల్లవీధిలో నిరసన చేపట్టింది. ఈసందర్భంగా సన్యాసమ్మ, గాయత్రి కుటుంబాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. తనకు డబ్బులు ఇవ్వకపోతే ఆత్మహత్యకు పాల్పడతానని చెబుతూనే సన్యాసమ్మ నిద్రమాత్రలు మింగింది. ఒంటిపై పెట్రోల్ పోసుకుంది. దీంతో ఎస్ఐరాము ఘటనా స్థలానికి వచ్చి సన్యాసమ్మను జిల్లా కేంద్రాసుపత్రికి తరలించారు. కాగా గాయత్రిపై సన్యాసమ్మ సంతబొమ్మాళి పోలీస్‌స్టేషన్‌లో గతంలో ఫిర్యాదు చేసిందని టెక్కలి సీఐ విజయ్‌కుమార్ తెలిపారు. సంతబొమ్మాళి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదై ఉందని చెప్పారు.

## పాలకొల్లు వ్యక్తి ఆత్మహత్య

టెక్కలి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): టెక్కలి సమీపంలో ఓ ఇంజనీరింగ్ కళాశాలలో కుక్‌గా పనిచేస్తున్న పాలకొల్లు ప్రాంతానికి చెందిన చందనాన స్వామి(45) శుక్రవారం జాతీయరహదారి పక్కన ఎర్రన్నాయుడు సమగ్ర రక్షిత మంచినీటి పథకంలో పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శుక్రవారం సాయంత్రం రిజర్వాయర్‌లో మృతదేహం తేలిఉండడంతో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు సమాచారం అందింది. ఈమేరకు ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ మోహన్ సంఘటనా స్థలానికి చేరుకొని పోలీసులకు సమాచారం అందజేశారు. దీంతో పోలీసులు మృతదేహాన్ని బయటకు తీశారు. చందనాన స్వామి టెక్కలి సమీపంలో ఓ ఇంజనీరింగ్ కళాశాలలో కుక్‌గా పనిచేస్తున్నాడని, ఇటీవలే ఆయనకు భార్యతో విడాకులు అయ్యాయని, మానసికంగా ఇబ్బంది పడుతూ ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని ఆయన బంధువులు తెలిపారు. ఈ మేరకు సీఐ విజయ్‌కుమార్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

## బాలికపై లైంగిక దాడి కేసులో ఒకరి అరెస్టు

జలుమూరు (సారవకోట) ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): బాలికపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో సారవకోట మండలంలోని కోదడ్డపనసకు చెందిన పి.ముకుందరావు అలియాస్ రామారావును డీఎస్పీ ప్రసాదరావు పట్టుకొని శుక్రవారం అరెస్టుచేసినట్లు ఎస్ఐ అనిల్‌కుమార్ తెలిపారు. ఈమేరకు నిందితుడు వడ్డినవలస త్రినాథాలయం వద్ద పట్టుబడినట్లు చెప్పారు. పాతపట్నం కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు తెలిపారు.

## గంజాయి తాగుతూ పట్టుబడిన ఏడుగురు వ్యక్తులు

టెక్కలి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): టెక్కలి సమీపంలో శుక్రవారం ఓ తోటలో గంజాయి సేవిస్తూ ఏడుగురు వ్యక్తులు టాస్క్‌ఫోర్స్ పోలీసులకు పట్టుబడ్డారు.అయితే వీరి వద్ద కొంతగంజాయి కూడా లభ్యంకావడంతో గంజాయి వీరికి ఎక్కడ నుంచి సరఫరా జరిగిందన్న విషయంపై పోలీసులు ఆరాతీస్తున్నారు. పట్టుబడిన ఏడుగురు వ్యక్తుల నుంచి సమాచారం సేకరించారు. విచారణ కొనసాగుతోందని సీఐ విజయ్‌కుమార్ తెలిపారు.

## కవిటిలో వరి కుప్పల దగ్ధం

ఎల్.ఎన్.పేట, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి):మండలంలోని కవిటిలో శుక్రవారం చవుదల సురేష్‌కు చెందిన వరి వరికుప్పలు దగ్ధమయ్యాయి. బాధితుడు సురేష్, గ్రామస్థుల కథనం మేరకు..సురేష్‌కు సంబంధించిన మూడెకరాల వరి చేను, రెండెకరాల మినపపంట గ్రామసమీపంలోని కల్లంలో కుప్పలు పెట్టి ఉన్నాయి. వరికుప్పల వద్ద మంటలు ఎగిసిపడుతుండడం, పొగలు రావ డంతో పంటపొలాల్లో పనులు చేస్తున్నవారు గుర్తించారు.వెంటనే సంఘటనా స్థలానికిచేరుకొని మంటలు అదుపుచేయడంతోపాటు ఆమదాలవలస అగ్నిమా పకకేంద్రానికి ఫోన్‌లోసమాచారం అందజేశారు.సిబ్బంది శకటంతో చేరుకునే సరికి వరికుప్పలు, మినపచేను దగ్ధమయ్యింది. ప్రమాదంలో సుమారు రూ. రెండులక్షల ఆస్తినష్టం జరిగింది. కాగా పంట నష్టం నివేదికను తయారు చేసి జిల్లాస్థాయి అధికారులకు నివేదిస్తామని రెవెన్యూ అధికారులు తెలిపారు. అగ్ని ప్రమాదం ఎలా జరిగిందన్న విషయం తెలియరాలేదు.

# వేతన సవరణ ఒప్పందం అమలు చేయాలి

● రైస్ మిల్లు కార్మిక సంఘ నాయకుల డిమాండ్



రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న కార్మిక సంఘ నాయకులు

హరిపురం, ఫిబ్రవరి14 (ఆంధ్రజ్యోతి):రైస్‌మిల్లు కార్మికులకు యాజమాన్యాలు వేతన సవరణ ఒప్పందాన్ని అమలుచేయాలని కార్మికసంఘ నాయకులు డిమాండ్‌చేశారు.ఈ మేరకు శుక్రవారం మందస తహసీల్దార్ కార్యాయం ఎదుట ధర్నా నిర్వహించి కార్యాలయ సీనియర్‌అసిస్టెంట్ వి.జీవన్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి, మండల కన్వీనర్ కేశవరావు మాట్లాడుతూ ఎనిమిది నెలలుగా ఒప్పందం ప్రకారం వేతనాలు పెంచాల్సి ఉన్నా కనీసం యాజమాన్యాలు పట్టించుకోలేదని డిమాండ్ నోటీసు అందజేసినా స్పందనలేదని, దీంతో నాలుగురోజులుగా కార్మికులు సమ్మె బాట పట్టారని తెలిపారు. కార్యక్రమంలో కార్మిక నాయకులు దిలీప్‌కుమార్, టి.లక్ష్మీనారాయణ, బాలకృష్ణ, దుర్యోధన, కూర్మారావు, ఏకాశి, పోలయ్య, చంద్రావతి, బాలమ్మ, జానకమ్మ, హిమావతి పాల్గొన్నారు.

## సెమిస్టర్ ఫలితాల్లో సత్తాచాటిన విద్యార్థులు

పలాస,ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి):పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఇటీవల బీఆర్ అంబేడ్కర్ యూనివర్శిటీ విడుదల చేసిన మూడో సెమిస్టర్ ఫలితాల్లో సత్తాచాటారు. ఈమేరకు శుక్రవారం ప్రిన్సిపాల్ జె.వెంకటలక్ష్మి, అధ్యాపకులు విద్యార్థులను అభినందించారు. బీకాం ఆనర్స్‌లో ఎస్.కావ్య, ఎస్.మక్బుల్ ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారు. బీఏ ఆనర్స్‌లో చామంతి, పూజిత, బీఎస్సీ ఆనర్స్‌లో ఎస్.ప్రదీప్, కె.రాజేష్, బిఎస్సీ ఆనర్స్ జువాలజీలో ఎన్.త్రివేణి, ఎ.మేఘనలు ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారు.

## కరాటే పోటీల్లో హిరమండలం విద్యార్థులు..

హిరమండలం, ఫిబ్రవరి14 (ఆంధ్రజ్యోతి): హిరమండలంలోని పలు పాఠశాలల విద్యార్థులు విశాఖపట్నం రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన ఎనిమిదో అంతర్జాతీయ కరాటే పోటీల్లో ప్రతిభ కనబరిచారని కరాటే శిక్షకుడు తోట సింహాచలం చెప్పారు.యూనిటెడ్-మహిర, పోటోకాన్ కరాటే డూ ఇండియా సంస్థలు సంయుక్తంగా నిర్వహించిన పోటీల్లో శ్రీలంక, భూటాన్, మలేషియా, ఇంగ్లాండ్, నేపాల్‌లతో పాటు దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారని చెప్పారు. సినీనటుడు సుమన్, తల్వార్ తాజుద్దీన్, హైదర్‌ఆలీ చేతులమీదుగా బెస్ట్‌టీం ఓవరాల్ చాంపియన్‌షిప్-2025 పురస్కారానికి తమ విద్యార్థులు అందుకున్నట్లు సింహాచలం చెప్పారు.

# ఎండల మల్లన్న ఆలయ కమిటీ నియామకంలో జాప్యం

టెక్కలి, ఫిబ్రవరి 14(ఆంధ్రజోతి): రావివలస ఎండల మల్లిఖార్జునస్వామి ఆలయ కమిటీ నియామకంలో జాప్యం జరుగుతోంది. ప్రసిద్ధ శైవక్షేత్రం కావడంతో మహాశివరాత్రి ఉత్సవాలకు ఆంధ్రా, ఒడిశా ప్రాంతాల నుంచి వేల సంఖ్యలో తరలిరానున్నారు. ఈ నేపథ్యంలో కమిటీ నియామకంపై జాప్యం జరిగితే కనీసం ఉత్సవ కమిటీనైనా దేవదాయశాఖ అధికారులు నియమించాల్సిఉంది. వైసీపీ హయాంలో డిసెంబరు ఒకటి 2023న అప్పట్లో ఆలయ కమిటీని నియమించారు. ఆ తర్వాత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు కావస్తున్నా ఆలయకమిటీ నియామక ప్రక్రియ జరగలేదు. అయితే ఆలయకమిటీ నియామకానికి మంత్రి అచ్చెన్నాయుడు ప్రతిపాదన చేస్తే తప్ప ధార్మిక పరిషత్ పచ్చజెండా ఊపే పరిస్థితిలేదని సమాచారం. ఈ ఆలయకమిటీ అధ్యక్ష స్థానానికి ఆశావహులుగా టీడీపీ నాయకుడు గతంలో ఆలయకమిటీ అధ్యక్షులుగా పనిచేసిన ఎల్ఎల్ నాయుడు ఈసారి కూడా ఆ పదవిని ఆశిస్తున్నారు.

# బర్డ్‌ఫ్లూపై అప్రమత్తంగా ఉండాలి

● ర్యాపిడ్ రెస్పాన్స్ టీముల ఏర్పాటు ● జిల్లాలో వ్యాధి లేదు

● పశుసంవర్ధక శాఖ జేడీ కంచరాన రాజగోపాలరావు

పాతపట్నం ఫిబ్రవరి14(ఆంధ్రజ్యోతి): బర్డ్‌ఫ్లూ నియంత్రణపై రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలని పశుసంవర్ధకశాఖ జిల్లా సంయుక్త సంచాలకుడు కంచరాన రాజగోపాలరావు ఆదేశించారు. శుక్రవారం ఆంధ్రా-ఒడిశా సరిహద్దులో గల పాతపట్నం, వసుంధర చెక్‌పోస్టులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చనిపోయిన కోళ్ల వాహనాలను ప్రవేశించకుండా నిఘా ఉంచాలని సిబ్బందిని సూచించారు. తొలుత పాతపట్నంలోని ప్రాంతీయ పశువైద్యశాలలో ఏడీ పరిధిలోని పశువైద్యాధికారులతో సమీక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బర్డ్‌ఫ్లూ వ్యాధిపై కోళ్లపెంపక దారులకు పూర్తిస్థాయిలో అవగాహన కలిగించాలన్నారు. కోళ్లఫారాలను విధిగా సందర్శించి పెంపకదారులకు సూచనలివ్వాలని ఆదేశించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటికైతే జిల్లాలో బర్డ్‌ఫ్లూవ్యాధిలేదని, నియంత్రణకు ముందస్తుచర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జిల్లావ్యాప్తంగా సిబ్బందిని అప్రమత్తం చేశామని, జిల్లావ్యాప్తంగా ర్యాపిడ్ రెస్పాన్స్ బృందాలను ఏర్పాటు చేసి ఎటువంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సిద్ధంచేశామని చెప్పారు.ఆయన వెంట ప్రాంతయ పశువైద్యశాల ఏడీ మంచు కరుణాకరరావు, పశువైద్యాధి కారులు పిఅనిల్, బి.శ్రీవాణి, కె.మౌనిక, సిబ్బంది డిల్లీ, భీమారావు, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.



పశువైద్యాధికారులకు సూచనలిస్తున్న రాజగోపాలరావు

# 23న న్యూడెమోక్రసీ పార్టీల విలీన ప్రకటన సభ

పలాస రూరల్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి):మండలంలోని బొడ్డపాడు అమరవీరుల స్మారక మందిరంలో రెండు న్యూడెమోక్రసీ పార్టీల విలీన ప్రకటన సభ ఈనెల 23న నిర్వహించనున్నారు. ఈమేరకు సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాశ్, కమిటీ సభ్యుడు వంకల మాధవరావు, ప్రజాసంఘాల నాయకులు గొరకల బాలకృష్ణ, జి.వీరాస్వామి,పి.కుసుమ, బర్ల జానకమ్మ, సారజగన్, పి.మల్లిబాబు ఆ సభ కరపత్రాలను ఆవిష్కరించారు.ఈసందర్భంగా తాండ్రప్రకాశ్ మాట్లాడుతూ సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ 2013లో రాజకీయవిభేదాల వల్ల రెండుగా చీలిందని, సమస్యలు పరిష్కరించుకొని తిరిగి ఏకమతున్నట్లు చెప్పారు.

## నేటి నుంచి అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు

నందిగాం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని మణిగాంలో నిర్మించిన అభయాంజనేయస్వామిమందిర, విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు శనివారం నుంచి నిర్వహించనున్నట్లు గ్రామస్థులు తెలిపారు. పురోహితులు రేజేటిబోసుబాబు,రుత్వికుల పర్యవేక్షణలో మూడురోజుల పాటు పూజలు నిర్వహించి సోమవారం విగ్రహ ప్రతిష్ఠించనున్నట్లు పేర్కొన్నారు.

## పారిశుధ్య నిర్వహణలో టెక్కలి ఆస్పత్రికి సముచిత స్థానం

టెక్కలి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): టెక్కలిలోని జిల్లా కేంద్రాసుపత్రికి పారిశుధ్య నిర్వహణలో సముచిత స్థానం లభించింది. వివిధ ఆసుపత్రుల్లో పారిశుధ్య నిర్వహణపై ఐవీఆర్ఎస్ సర్వే నిర్వహించారు. ఈమేరకు గురువారం డైరెక్టరేట్‌ఆఫ్ సెకెండరీ హెల్త్‌డైరెక్టర్ అట్టాడ సిరి జిల్లా ఆసుపత్రి 82శాతం పరిశుభ్రత పాటిస్తుందని జనవరి 27 నుంచి ఈనెల ఏడోతేదీవరకు ఐవీఆర్ఎస్ సర్వే ఆధారంగా గుర్తించినట్లు పేర్కొన్నారు. 82శాతంతో జిల్లాకేంద్రాసుపత్రిలో పారిశుధ్య నిర్వహణ మెరుగ్గా ఉందని గుర్తించినట్లు పేర్కొన్నారు.

## కలమటను కలిసిన మిల్లర్లు



కలమట వెంకటరమణకు సమస్యలు వివరిస్తున్న మిల్లర్ల సంఘ నాయకులు

కొత్తూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి: మాతలలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకటరమణను జిల్లా రైస్‌మిల్లర్స్ అధ్యక్షుడు బోయినరమేష్, సెక్రటరీ ఎస్. మురళీకృష్ణ, జాయింట్ సెక్రటరీ గండికోట త్రినాథరావు, ట్రెజరర్ నాగేశ్వరరావు,మండల మిల్లర్స్ అధ్యక్షులు రమణారావు,కొత్తూరు మండల మిల్లర్లు శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా మిల్లర్ల సమస్యలపై చర్చించారు.

# పారిశుధ్య పనులు పక్కాగా చేపట్టాలి

●జిల్లా పంచాయతీ అధికారి సౌజన్య భారతి



శ్రీముఖలింగంలో పారిశుధ్య పనులపై సూచనలిస్తున్న సౌజన్య భారతి

జలుమూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): శ్రీముఖలింగంలో మూడు రోజులు పాటు నిర్వహించే మహాశివరాత్రి ఉత్సవాలకు పారిశుధ్యం పనులు పక్కాగా చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారి సౌజన్య భారతి ఆదేశించారు. శుక్రవారం శ్రీముఖలింగంలో పారిశుధ్యం పనులపై అధికారులతో సమీక్షించారు. ప్రతి వీధిలోను వీధి దీపాలు వేయించాలని తెలిపారు. తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేసి నీటి సౌకర్యం కల్పించాలని కోరారు. పారిశుధ్య పనులకోసం టెక్కలి, నరసన్నపేట నుంచి పారిశుధ్య కార్మికులను ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఎల్పీవో ఐవీరమణ, ఈవోపీఆర్డీ ఉమామహేశ్వరరావు, సర్పంచ్ టి.సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

## శివరాత్రి ఉత్సవాలు విజయవంతం చేయండి

అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి శ్రీముఖలింగం మహాశివరాత్రి ఉత్సవాలు విజయవంతం చేయాలని శ్రీకాకుళం ఆర్డీవో కె.సాయి ప్రత్యూష ఆదేశించారు. శుక్రవారం శ్రీముఖలింగంలో అధికారులతో సమీక్షించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వామి దర్శనంకోసం వచ్చే భక్తులకు అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు పక్కాగా చేయాలన్నారు. ఉచిత, ప్రత్యేక దర్శనాలకు వచ్చే భక్తులకు వేర్వేరు బారికేడ్లు ఏర్పాటుచేయాలని కోరారు. జనరేటర్లు సిద్ధంగా ఉంచుకోవాని, స్నానఘట్టాలకు వెళ్లే భక్తులకు ఇబ్బందిలేకుండా లైటింగ్ ఏర్పాటు చేయాలన్నారు. ఆలయం సమీపంలో వైద్య శిబిరాలు నిర్వహించాలని, అన్ని వీధుల్లో తాగునీటి సౌకర్యం కల్పించాలని కోరారు. సమావేశంలో దేవదాయశాఖ ఏసీ ప్రసాద్ పట్నాయక్, ఈవో పి.ప్రభాకరరావు, తహసీల్దార్ జన్ని రామారావు, డీఎల్పీవో ఐవీరమణ, ఎంపీడీవో కె.అప్పలనాయుడు, ఈవోపీఆర్డీ ఉమామహేశ్వరరావు, సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ అశోక్‌బాబు పాల్గొన్నారు.

## ఉత్తమ ఫలితాల సాధనకు సహకరించాలి

నందిగాం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి):పదోతరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు తల్లిదండ్రులు సహకరించాలని హెచ్‌ఎం చిలుకు కృష్ణారావు కోరారు. శుక్రవారం లఖిదాసుపురం ఉన్నతపాఠశాలలో పదో తరగతి విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఉపాధ్యాయులు రామారావు, రత్నం, శ్రీనివాస్, ప్రియదర్శిని, త్రినాథరావు, ఎస్ఎంసీ చైర్మన్ ఎం.సీతారాం పాల్గొన్నారు.

# కొలతల ప్రకారం పనులు చేయించాలి: ఎంపీడీవో

జలుమూరు (సారవకోట) ఫిబ్రవరి 14: (ఆంధ్రజ్యోతి): వేతనదారులకు ముందుగా కొలతలు వేసి పనులు అప్పగించి ఆ ప్రకారం పనులు చేయించాలని ఎంపీడీవో మురళీమోహన్ కుమార్ ఆదేశించారు. శుక్రవారం సారవకోట మండలంలోని కొమ్మసరియాపల్లిలో చేపడుతున్న ఉపాధి పనులను పరిశీలించారు.అలాగే వాండ్రాయిలో గల చెత్త నుంచి సంపద కేంద్రాన్ని పరిశీలించారు. కార్య క్రమంలో ఈవోపీఆర్డీ ప్రభాకరరావు పాల్గొన్నారు.

## పాతపట్నంలో 40 మందికి బియ్యం పంపిణీ

పాతపట్నం,ఫిబ్రవరి14(ఆంధ్రజ్యోతి):పాతపట్నంలోని నవజీవనఆశ్రమం నిర్వాహకులు 40మంది వితంతువులకు అన్నలక్ష్మిపథకంకింద ఆశ్రమవ్యవస్థాపకుడు కె.శ్రీధర్ ఆచార్య చేతులమీదుగా బియ్యం పంపిణీచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతినెలా అన్నలక్ష్మిపేరిట పేదమహిళలకు బియ్యం అందజేస్తున్నట్లు తెలిపారు.

## నందిగాంలో సంతోషిమాత ఆలయ వార్షికోత్సవం

నందిగాం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి):నందిగాంలో సంతోషిమాత ఆలయ 23వ వార్షికోత్సవం శుక్రవారం నిర్వహించారు.ఆలయ నిర్వాహకురాలు ఎస్.మహాలక్ష్మి ఆధ్వర్యంలో పురోహితులు రేజేటి బోసుబాబు, రమేష్‌శర్మల పర్యవేక్షణలో 16 వారాలపాటు దీక్షలు చేసిన భక్తులతో ఘటాలను ఊరేగించారు. పూడిచెల్లెమ్మ కోనేరులో ఘటాలు నిమజ్జనం చేశారు.

## పంచముఖాంజనేయ స్వామి..

పోలాకి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): రాళ్లపాడు పంచాయతీ జగన్నాథస్వామి కాలనీలో గల పంచముఖ అభయాంజనేయస్వామి 12వ వార్సికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా పురోహితులు వనమాలి రామచంద్రశర్మ, తేజశర్మలు దంపతులతో పూజలు చేయించారు.ఆలయ కమిటీ సభ్యులు తులసిపాటి కృష్ణంరాజు, తిరుమల, గేదెల లక్ష్మీనారాయణ, జి.అన్నారావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వంశధార డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ ఎవీనాయుడు పాల్గొన్నారు. కాగా కింజరాపువానిపేట ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం నిర్వహించారు. సుసరాం దుర్గమ్మ జాతర ప్రారంభమయ్యింది.

## కొత్తమ్మతల్లి ఆలయంలో పూజలు

కోటబొమ్మాళి, ఫిబ్రవరి14(ఆంధ్రజ్యోతి): స్థానిక కొత్తమ్మతల్లి అమ్మవారిని నరసన్నపేట జూనియర్ సివిల్‌కోర్టు న్యాయాధికారి హరిప్రియ గురువారం దర్శించుకొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి కమ్మకట్టు రాజేష్ ప్రత్యేక పూజలు చేశారు.



నందిగాం: ఘటాలను ఊరేగిస్తున్న భక్తులు

## తూనికల్లో తేడాలొస్తే చర్యలు

పాతపట్నం,ఫిబ్రవరి14(ఆంధ్రజ్యోతి) : తూనికల్లో తేడాలొస్తే చర్యలు తప్పవని ఆ శాఖ ఇన్‌స్పెక్టర్ టి.శ్రీధర్ హెచ్చరించారు. శుక్రవారం పాతపట్నంలో వార్షిక తనిఖీల్లో భాగంగా షాపుల్లో తూనిక యంత్రాలను గుళ్లను పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ మండలంలో 218 ట్రేడర్స్ ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. వ్యాపారులు వాడే తూనిక గుళ్లను సీళ్లు వేసినట్లు చెప్పారు.

## పంటల రక్షణపై అవగాహన

మెళియాపుట్టి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): కేరాశింగి, గొట్టిపల్లి, వీరన్నాపేటల్లో గిరిజనరైతులు విపత్తుల సమయంలో పంటలను రక్షించుకోవడంపై కొత్తూరు వెలుగు అసోసియేషన్ సభ్యులు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఏసీ నాగరాజు, జి.జగన్ మాట్లాడుతూ వాతావరణం వల్ల అధికంగా తెనేమంచు, ఉష్ణోగ్రతల వల్ల రైతులు నష్టపోతున్నారని తెలిపారు.